ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 42.0
కనిష్ఠం : 26.0



రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. సీఎం సమక్షంలో కేక్ కట్ చేశారు



భీమవరంలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, జేసీలు, రైస్‌మిల్లర్లతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు

7

రహదారిపై ప్రమాదాలు ఆపండి

> రహదారి ప్రమాదాలు, మరణాలు పెరుగుతున్నాయి. దీనికి అడ్డుకట్ట వేయాలి. వాహనాల అతి వేగం నియంత్రించాలి. జాతీయ రహదారులపై ప్రమాదాలకు కారణాలను విశ్లేషించి, నియంత్రణకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలి.
> **కొలుసు పార్థసారథి, గృహ నిర్మాణశాఖ మంత్రి**

- అతివేగం నియంత్రించాల్సిందే
- నిఘా వేసి కేసులు నమోదు చేయండి
- హైవేపై ప్రమాద ప్రాంతాల పరిశీలన
- రోడ్డు భద్రతా కమిటీ జిల్లా సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి



జాతీయరహదారిపై బ్లాక్ స్పాట్‌ల గురించి తెలుసుకుంటున్న మంత్రి సారథి, ఎంపీ మహేశ్, ఎమ్మెల్యే చింతమనేని

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

జాతీయ రహదారి, ప్రధాన రహదారుల్లో ప్రమాదాలను నివారించాలిన మంత్రి కొలుసు పార్థసారథి అధికారులకు తేల్చి చెప్పారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లా రహదారుల భద్రతా కమిటీ సమావేశంలో ఆయన అధికారులకు సూచనలు చేశారు. సమావేశానికి ముందు జాతీయ రహదారిపై అధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాన్ని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి ఆయన పరిశీలించారు.

హైవే పెట్రోలింగ్ నిరంతర నిఘా ఉండాలని, జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్‌లను గుర్తించాలని, అతి వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ గన్‌లను ఏర్పాటు చేసి గీత దాటిన వారిపై కేసులను నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లా, నియోజకవర్గ స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశాలు నిర్వహించాలని, రహదారి భద్రత, హెల్మెట్ ధారణ, మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.

మంత్రి పార్థసారథి ప్రాతినిధ్యం వహిస్తున్న నూజివీడు నియోజకవర్గంలో రహదారి సమస్యలు నేరుగా ఏకరవు పెట్టారు. పలు అంశాలను జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి దృష్టికి తీసుకువచ్చారు. మర్రిబంధం, మీర్జాపురం, గొల్లపల్లి, మొర్సపూడి, తుక్కులూరు వద్ద రహదారిపై ప్రమాద పరిస్థితులను మంత్రి వివరించారు. నూజివీడు- ఆగిరిపల్లి మధ్య ఎన్నో పాఠశాలలు - మిగతా 8వ పేజీలో

వేతన సవరణ సంఘం నియమించండి

ఏపీటీఎఫ్ డిమాండ్

ఏలూరు అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం తక్షణమే స్పందించి 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలని ఏపీటీఎఫ్ డిమాండ్ చేసింది. కమిటీ నివేదిక అందేలోగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30శాతం మధ్యంతరభృతి (ఐఆర్) ఇవ్వాలని కోరారు. ఏలూరులో మంగళవారం జరిగిన ఏపీటీఎఫ్-1938 సంఘ సమావేశంలో సంఘ కన్వీనర్ జి.కృష్ణ మాట్లాడుతూ పెండింగ్‌లో వున్న 3 డీఏలు మంజూరు చేయాలన్నారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగావున్న బకాయిల చెల్లింపులకు నిదులు విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతోపాటు, తెలుగు, మైనార్టీ మాధ్యమాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. అన్నిరకాల ప్రాథమిక పాఠశాలలకు ఒకేవిధంగా ఉపాధ్యాయుల కేటాయింపు జరగాలని కోరారు. టీచర్ల బదిలీలను ఆన్‌లైన్ విధానం కాకుండా మాన్యువల్‌గా నిర్వహించాలని డిమాండ్ చేశారు. నాయకులు రామ్మోహన్, మోహన్‌రావు, శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో పారిశ్రామిక వాడ



పట్టాయిగూడెంలో సేకరించిన స్థలం

రేపు శంకుస్థాపన

- పట్టాయిగూడెంలో 69.5 ఎకరాల సేకరణ
- తొలుత 20 ఎకరాల్లో మౌలిక వసతులు
- పరిశ్రమల ఏర్పాటుకు ఆహ్వానం
- స్థానిక యువతకు ఉపాధి
- పారిశ్రామికవేత్తలను కలిసిన ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్

ఏలూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి నియోజకవర్గంలో పారిశ్రామికవాడ ఏర్పాటు కానుంది. చింతలపూడి నియోజకవర్గంలోని పట్టాయిగూడెం ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) పారిశ్రామిక వాడ ఏర్పాటు చేయడానికి 69.50 ఎకరాల స్థలం గుర్తించారు. ఇటీవలే ఆంధ్రప్రదేశ్ పారిశ్రా మిక మౌలిక సదుపాయాల కల్పన సంస (ఏపీఐఐసీ) అధికారులు కూడా స్థల పరిశీలించారు. పారిశ్రామికవాడ ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ నెల 8న పారిశ్రామిక వాడకు శంకుస్థాపన చేయాలని నిర్ణయించారు. నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుతో మెట్ట ప్రాంతంలోని నిరుద్యోగులకు స్థానికంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

20 ఎకరాల్లో మౌలిక వసతులు

పట్టాయగూడెంలో 69.50 ఎకరాలు గుర్తించగా తొలుత ఏపీఐఐసీ 20 ఎకరాల్లో భూమిని తీసుకుని లేఅవుట్ తయారు చేస్తోంది. రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ సౌకర్యాలు కల్పిస్తున్నారు. భవిష్యత్‌లో మంచినీటి సౌకర్యం కల్పించనున్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు వీలుగా మౌలిక వసతులను కల్పిస్తారు. ఆరు నెలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నారు. నెలరోజుల్లో టెండర్లు పిలిచి 20 ఎకరాల్లో వసతులను కల్పిస్తామని విజయవాడలోని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కె.బాబ్జి తెలిపారు.

మిగతా ఆరు నియోజకవర్గాలలో..

ప్రతీ నియోజకవర్గంలో పారిశ్రామికవాడ ఏర్పాటుకు అనువుగా స్థలాలు గుర్తించాల్సి ఉంది. రెవెన్యూ పరిశ్రమలశాఖ, ఏపీఐఐసీ అధికారులు ముందుకు కదలితే జిల్లా అంతటా నిరుద్యోగ యువతకు స్థానికంగానే ఉపాధి మార్గాలు ఏర్పడతాయి. ఈ దిశగా అధికారులు కార్యాచరణ చేపట్టాల్సి ఉంది.



పార్థసారథిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే రోషన్

పెట్టుబడులతో రండి : ఎమ్మెల్యే రోషన్‌కుమార్

చింతలపూడిలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటూ ఎమ్మెల్యే రోషన్‌కుమార్ పారిశ్రామిక వేత్తలను ఆహ్వానిస్తున్నారు. స్థానికంగా హైస్కూలు విద్య పూర్తిచేసుకున్న హెటిరో డ్రగ్స్ అధినేత బండి పార్థసార్థి రెడ్డిని హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మంగళవారం కలిశారు. ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. చంద్రబాబు నేతృ త్వంలో కూటమి ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహమి స్తుందని వివరించారు. ఏర్పాటు ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేవిధంగా సహకరించాలని కోరారు.

అధికారితో..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

జిల్లాలో విద్యుత్ సరఫరాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యవసాయ విద్యుత్, బిల్లింగ్, మీటర్ సమస్యలు, ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు, విద్యుత్ పొదుపు తదితర అంశాలపై ఈనెల 7వ తేదీ బుధవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య 'ఆంధ్రజ్యోతి ఫోన్‌ఇన్' నిర్వహించనుంది. ప్రజలు

94408 12703

నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను తెలిపితే వాటి పరిష్కారానికి ఏలూరు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ పి.సాల్మన్‌రాజు చర్యలు తీసుకుంటారు.

సబ్సిడీ విత్తనాల అక్రమ రవాణా

ఏలూరులో విజిలెన్స్ తనిఖీ

ఇద్దరిపై కేసు నమోదు.. వ్యాన్ సీజ్

7

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

'బెల్ట్' తీశారు

ఎక్సైజ్ దాడుల్లో 160 కేసులు నమోదు

160 మంది అరెస్టు

ఏలూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుచోట్ల ఎక్సైజ్‌శాఖ అధికారులు బెల్టుషాపులపై దాడులు చేశారు. 160 మంది కేసులను నమోదు చేసి 160 మందిని అరెస్ట్ చేశారు. 'బెల్టు జోరు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఈ నెల 6న ప్రచురితమైన కథనంపై ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య స్పందించారు. ఏడు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని గుండుగొలనుకుంట, భీమడోలు, పెదపాడు మండలం సత్యవోలు, పెదవేగి మండలం రాట్నాలకుంటతో పాటు అన్ని చోట్ల ఏకకాలంలో దాడులు చేపట్టారు. 160 మందిని అరెస్టు చేశారు. 250 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నామని, బెల్టుషాపులను నడుపుతున్న 53 మందిని గుర్తించి తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేసినట్లు ఆవులయ్య తెలిపారు. 32 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.



ఈసెట్ ప్రశాంతం

ఏలూరులో 3 పరీక్ష కేంద్రాలు

670 మంది విద్యార్థులకు 657 మంది హాజరు

భద్రతా ఏర్పాట్ల మధ్య నిర్వహణ

7

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఫోరెన్సిక్ నిపుణులతో ఒకరోజు ప్రత్యేక శిక్షణ



Nuzvid Rural Sunkollu Village Materials Aud[it]

S.No	Name of the Material	Total No of Beneficiaries	Total Quantity Issue to Beneficiary	Amount	Beneficiary Received (Quantity)
1	Sand (in MTS)	168	1982	[illegible]	1302
2	Cement (in Bags)		8770	[illegible]	5820
3	Steel (in Kgs)		26915	[illegible]	14963
4	Other Material (No of items)		183	[illegible]	172
	Total Amount		37550	[illegible]	22257

Sunkollu Village Ineligible Repor[t]

Cash Payment	42	4461075
Material Payment		1513453
Total Payment		5974528
Beneficiary Not taken the material (Cost)	168	1651895
Grand Total	210	7626423

Assistant Engineer, A.P. State Housing Corporation, NUZVID Mandal
Deputy Executive Engineer, A.P. State Housing Corporation, NUZVID

ఇంటి దొంగలు దొరికినా నో యాక్షన్

సుంకొల్లు హౌసింగ్‌లో రూ.76 లక్షలు కైంకర్యం

- శాఖాపరమైన నివేదిక వచ్చినా చర్యలు తీసుకోవడంలో జాప్యం
- వైసీపీ హయాంలో జరిగిన ఈ అవినీతిపై చర్యలకు కూటమి ప్రభుత్వం వెనకడుగు !



నూజివీడు నియోజకవర్గం సుంకొల్లులో జరిగిన హౌసింగ్ స్కామ్‌ను మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకువస్తున్న గ్రామస్తులు, లబ్ధిదారులు

> నూజివీడు మండలం సుంకొల్లు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత మేకా వెంకటప్రతాప్ అప్పారావుకు రాజకీయంగా పెట్టనికోట. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామానికి చెందిన ఇద్దరు నాయకులు హౌసింగ్ అధికారులు, వలంటీర్ల సహకారంతో బీసీ, ఎస్సీ లబ్ధిదారుల పేర్లతో, ఇల్లు కట్టకుండానే మెటీరియల్, నగదు డ్రా చేశారు. కోటి 70 లక్షల మేర పక్కదారి పట్టించినట్లు 2024 ఆగస్టులో ప్రచారం జరిగింది. అదే నెల 31న గ్రామాన్ని సందర్శించిన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి గ్రామస్తులు, లబ్ధిదారులు తీసుకుని వచ్చారు. మంత్రి ఆదేశాలతో జరిగిన దర్యాప్తు అనంతరం ఆరు నెలల వరకు నివేదిక బయటకు రాలేదు. ఇందులో 210 మంది లబ్ధిదారుల పేరిట రూ.76,26,423 దుర్వినియోగమైనట్లు తేల్చారు. కాని, సంబంధిత అధికారులు, బాధ్యులపై ఇంత వరకు ఏ విధమైన చర్యలు తీసుకోలేదు.

(నూజివీడు, ఆంధ్రజ్యోతి)

నూజివీడు నియోజకవర్గ పరిధిలోని గృహ నిర్మాణ శాఖలో అవినీతిపర్వం రెండోమారు కొన సాగింది. తొలిసారి కాంగ్రెస్ పాలనలో (అప్పుడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు) ముసునూరు గృహ నిర్మాణాల్లో జరిగిన అవకతవకలు బయటపడటంతో నాటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం విజిలెన్స్ విచారణ జరిపింది. ఈ విచారణలో ఆరోపణలు రుజువు కావడంతో నాటి ముసునూరు మండల హౌసింగ్ ఏఈని ఉద్యోగం నుంచి తొలగించారు. పలువురు అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. ముసునూరులో జరిగిన నిధులు కైంకర్యం రూ.48 లక్షలుగా తేల్చి ఆర్.ఆర్.యాక్ట్ ద్వారా (రెవెన్యూ రికవరీ యాక్ట్) ద్వారా సదరు నిధులను వసూలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఆ నిధులు ఇంత వరకు ప్రభుత్వ ఖజానాకు జమకాలేదు. ముసునూరు స్కామ్‌లోను నాటి కాంగ్రెస్ నాయకులు ఉన్నా ఎవరిపైనా చర్యలు లేవు. ఇప్పుడు సుంకొల్లులో ఇద్దరు వైసీపీ నాయకుల ఒత్తిడి వల్లే తాము కళ్లు మూసుకోవాల్సి వచ్చిందని, హౌసింగ్ అధికారులు మంత్రి పార్థసారథి దృష్టికి బహిరంగంగా తీసుకువెళ్లగా ఆయన పోలీసు కేసు పెట్టమని సదరు హౌసింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు. సదరు ఉద్యోగి ఆరు నెలల క్రితం నూజివీడు రూరల్ పోలీసు స్టేషన్‌లో వైసీపీ నాయకుల పేర్లతో సహా ఫిర్యాదు చేశారు. దానిపైన ఇంత వరకు ఎలాంటి చర్యలు ప్రారంభం కాలేదు.

లబ్ధిదారుల గగ్గోలు

కొందరు లబ్ధిదారులు తమకు తెలియకుండానే తమ పేర్లతో మెటీరియల్ డ్రా చేశారని, గగ్గోలు పెడుతున్నారు. హౌసింగ్ శాఖ మెటీరియల్ సప్లై డిపో నుంచి వీరి పేరుతో ఎవరు మెటీరియల్ డ్రా చేశారో, విచారిస్తే నిజాలు బయటకు వస్తాయి. డిపో నుంచి మెటీరియల్ ఇచ్చేటప్పుడు నిబంధనలను పాటించలేదు. సామూహికంగా లబ్ధిదారుల సంతకాలతో కూడిన పత్రాలు ఎవరో తీసుకుని వచ్చి (అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో) లబ్ధిదారుల పేరుతో మెటీరియల్ (సిమెంట్, ఐరన్) డ్రా చేసుకుని వెళ్లారని తెలుస్తోంది.

తీగలాగితే..

ఈ గ్రామంలో వైసీపీ హయాంలో ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు, హౌసింగ్ శాఖ నుంచి లబ్ధిదారుల పేర్లతో డ్రా చేసి తీసుకువచ్చిన మెటీరియల్ వెళ్లిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ తీగలాగితే మరో శాఖలో జరిగిన అవినీతి బయటకు వస్తుంది. మొత్తం స్కామ్ బయటపడాలంటే శాఖాపరమైన దర్యాప్తు కాక విజిలెన్స్ విచారణ ప్రభుత్వం జరపాలి. రాజకీయ పార్టీ నేతలు ఎక్కడా రాత పూర్వకంగా చిక్కలేదు. ఇక్కడ హౌసింగ్ ఉద్యోగులే బలయ్యే పరిస్థితి కనిపిస్తోంది. కోటి 70 లక్షల నుంచి రూ.76 లక్షలకు అవినీతి జరిగిందని వచ్చిన రిపోర్ట్‌పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రక్షాళన ప్రారంభించాలి

మంత్రి పార్థసారథి తన ఇంటి శాఖ నుంచే అవినీతిని ప్రక్షాళన ప్రారంభించాలి. రాష్ట్రవ్యాప్తంగా హౌసింగ్ నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపితే శాఖలో దుర్వినియోగమైన నిధులను ఆర్‌ఆర్ యాక్ట్ ద్వారా ప్రభుత్వ ఖజానాకు తిరిగి జమ చేయించవచ్చు. ఆరు నెలల నుంచి సుంకొల్లు స్కామ్‌పై చర్యలు తీసుకోవడంలో తాత్సారం ఎందుకో ఆ శాఖ అధికారులకే తెలియాలి. విమర్శలకు తావు లేకుండా మంత్రి నియోజకవర్గంలోని లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలి.

సబ్జా పానీయం

వేసవిలో దివ్య ఔషధం



రోజురోజుకు ఎండలు తీవ్రం కావడంతో బయటకు వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి. ఇంట్లో కరెంటుకోత, ఉక్కబోతతో ఎన్ని నీళ్లు తాగిన తీరని దాహం. శరీరం లో తేమశాతం తగ్గితే దాహం అధికమవుతుంది. వేసవి వేడిని తట్టుకుని ఆరోగ్యాన్ని కాపాడు కోవడంపై దృష్టి సారించాలి. ముఖ్యం గా పిల్లలు, వృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండలో వెళ్లాల్సివచ్చినప్పుడు ఎండ బారి నుంచి రక్షణ, డీహైడ్రేషన్‌కు గురికాకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలి. వేసవితాపాన్ని తగ్గించడంలో సబ్జా గింజలు దివ్య ఔషధంగా పనిచేస్తాయి. రోజుకు రెండు మూడుసార్లు చల్లని నీటితో సబ్జా గింజలు తీసుకుంటే వేడి నుంచి ఉపశమనం కలుగుతుంది. ఎండ తీవ్రతతో మంచినీటికి బదులు కూల్‌డ్రింక్స్, ఎనర్జీ డ్రింకుల వైపు ఎక్కువ మంది ఆసక్తి చూపుతారు. దీనితో మరికొన్ని సమస్యలు తెచ్చిపెట్టుకోవడమే. శీతలపానీయాల జోలికిపోకుండా సబ్జా గింజలు తాగితే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని పెద్దలతో పాటు వైద్య నిపుణులు చెబుతున్నారు. నానబెట్టిన సబ్జా గింజలు నీటిలో వేసి చిటికెడు పంచదార కలిపి తాగితే శరీరానికి చలవ చేస్తుంది. సబ్జాగింజల పానీయం ఒంటికి ఆరోగ్యమని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

సబ్జా పానీయం ఇలా..



- గుప్పెడు సబ్జా గింజలు శుభ్రం చేసి మంచినీటిలో నానబెట్టాలి. గింజలు కాస్తా జెల్లీలా మారిపోతాయి.
- గ్లాసు నీటిలో నిమ్మకాయ రసం కలిపి నానబెట్టిన సబ్జాలు వేసుకుని తాగితే మధు మేహ వ్యాధిగ్రస్తులకు మంచిది.
- పచ్చిపాలల్లో నాలుగు ఐదు చుక్కలు వెనీలా కలిపి సబ్జా గింజలు తాగితే టైప్ 2 మధుమేహం నుంచి ఉపశమనం.
- ఆరెంజ్ ఎసెన్స్‌తో ఐస్, పంచదార కలిపి సబ్జా గింజలు వేసుకుని శీతల పానీయంలా తాగవచ్చు.
- స్ట్రాబెర్రి, పాలు, సబ్జాగింజల పానీయం కూడా ఆరోగ్యకరం.
- రోజ్‌మిల్క్‌లో సబ్జా గింజలు వేస్తే చక్కని రుచి. పండ్లు, మజ్జిగ, లస్సీ వంటి పదార్థాల్లో కూడా సబ్జాలు జోడిస్తే ఎంతో మేలు.

- గణపవరం, (ఆంధ్రజ్యోతి)



తినవయ్యా స్వామీ..!

తినవయ్యా స్వామి.. తిను అన్నట్లుగా ఓ వానరం తన చేతిలో ఉన్న అరటిపండును ఆంజనేయుని విగ్రహానికి పెట్టడం అబ్బుర పరచింది. ద్వారకాతిరుమల తూర్పువీధిలో కొలువైన ఆంజనేయ స్వామి ఆలయంలోకి ఒక వానరం నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్లి హనుమంతుని విగ్రహం చేతులపై కూర్చొని అరటిపండును అదించడం పలువురిని ఆశ్చర్య చకితుల్ని చేసింది. అసలే మంగళవారం హనుమంతునికి ప్రీతికరమైన రోజున ఇలా జరగడంతో భక్తులు జై హనుమాన్...అంటూ చేతులెత్తి దండాలు పెట్టుకున్నారు.ఈ ఘటన పలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది.

- ద్వారకాతిరుమల, మే 6 (ఆంధ్రజ్యోతి)



వందేళ్ల నాటి ఎడ్ల బండి

సరైన రవాణా మార్గాలు లేని ఆ రోజుల్లో రైతుల వరి క్షేత్రాలను పరిశీలించేందుకు శాస్త్రవేత్తలు వందేళ్ల క్రితం వాడిన ఎడ్లబండి ఇది.. ఇటీవల దానికి రంగులు వేసి ముస్తాబు చేసి మార్టేరు వరి పరిశోధనా కేంద్రంలో ప్రదర్శనలో ఉంచారు. ఇటీవల జరిగిన గోదావరి మండలం పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం సందర్భంగా దీన్ని వ్యవసాయ క్షేత్రం వద్ద ఉంచారు. పలువురు రైతులు దీన్ని చూసి చర్చించుకున్నారు. మార్టేరు వరి పరిశోధన కేంద్రం దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో మార్టేరులో రూపొందించిన వరి వంగడాలు సాగు చేస్తున్నారని శాస్త్రవేత్తల కృషి అభినందించారు.

- పెనుమంట్ర, (ఆంధ్రజ్యోతి)



శేషాచల కొండపై బ్రహ్మోత్సవ శోభ

నేడు వరుడు కానున్న చినవెంకన్న



ద్వారకాతిరుమల, మే 6 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవ శోభతో చిన్నతిరుమల క్షేత్రం శోభాయమానంగా కనిపిస్తోంది. శ్రీవిశ్వావసు నామ సంవత్సర వైశాఖ మాస బ్రహ్మోత్సవాలకు ద్వారకాతిరుమల వెంకన్న క్షేత్రం సిద్ధమైంది. వాహన సేవలకు గజ, అశ్వ, సూర్యప్రభ, చంద్ర ప్రభ, హంస, సింహ తదితర వాహనాలను శుభ్రపరచి సిద్ధం చేశారు. ఆలయాన్ని, పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. బుధవారం ఉదయం 9-30 గంటలకు శ్రీవారిని పెండ్లి కుమారునిగా, పద్మావతి, ఆండాళ్ అమ్మ వార్లను పెండ్లి కుమార్తెలుగా చేయడంతో ఉత్సవాల నిర్వహణకు శ్రీకారం చుడతారు. బుధవారం స్వామివారిని శ్రీమహా విష్ణువుగా ప్రత్యేక అలంకారం చేయనున్నారు. ఉదయం 8 గంటలకు వేద పారాయణ, రాత్రి 7 గంటలకు గజ వాహనంపై శ్రీవారి తిరువీధిసేవ జరుగుతాయి. కల్యాణ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఈవో సత్యన్నారాయణమూర్తి తెలిపారు.





పెనుగొండ శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు

పెనుగొండ, మే 6 (ఆంధ్రజ్యోతి): పెనుగొండ నగరేశ్వర, మహిషాసుర మర్దని, శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకల్లో భాగంగా మంగళవారం 103 మంది కన్యకలచే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నగరేశ్వరస్వామికి రుద్రాభిషేకం, వాసవి కన్యకాపరమేశ్వరి, మహిషాసుర మర్దని అమ్మవార్లకు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.



అలంకరణలో స్వామివారు.. కల్యాణ పూజలు చేస్తున్న అర్చకులు..

ఘనంగా కాళ్ళకూరు వెంకన్న తిరుకల్యాణోత్సవాలు

కాళ్ళ, మే 6 (ఆంధ్రజ్యోతి) : కాళ్ళ మండలం కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి వార్షిక తిరుకల్యాణ మహోత్సవాలు మంగళవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం 6 గంటలకు మంగళ వాయిద్యాలు నడుమ విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు అష్టోత్తర శత తామర పూలతో పూజ, అంకురారోపణ, ధ్వజారోహణ, దీక్షధారణ, నీరాజన మంత్రపుష్ప తీర్థప్రసాద వినియోగం జరిపారు. భక్తులు విశేషంగా హాజరై స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ధ్వజారోహణ సందర్భంగా సంతానంలేని దంపతులు సంతానం కోసం శ్రీస్వామివారి గరుడ పొంగలి ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఈవో ఎం.అరుణ్ కుమార్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.




పాల్గొన్న వేద విద్యార్థులు

ముగిసిన వేద పరీక్షలు

తాడేపల్లిగూడెం రూరల్, మే6 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం శంకర మఠంలో ఉమా చంద్రమౌళేశ్వరస్వామి సర్వ మంగళ అమ్మవారి ఆలయం వద్ద మూడు రోజులుగా జరుగుతున్న వేద పరీక్షలు మంగళవారం ముగిశాయి. ఉభయ గోదావరి జిల్లాల నుంచి సుమారు 400 మంది వేద విద్యార్థులు పాల్గొనగా వారిని పరీక్షాధికారులు గుళ్ళపల్లి శ్రీహర్ష, ఉపాధ్యాయుడు బాబ్జి, పరీక్షించారు. పాలకొల్లు వాస్తవ్యులు బ్రహ్మశ్రీ వలివేటి శ్రీహరిశర్మను సువర్ణ సింహ తలాటంతో సత్కరించారు.

ఇక..ఊరూ వాడా పెళ్లి సందడి



ద్వారకాతిరుమల కొండపై విద్యుద్దీప వెలుగుల్లో దేవస్థానం కల్యాణ మండపం

7, 8, 9 తేదీల్లో మంచి ముహూర్తాలు

ద్వారకాతిరుమల, మే 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరస్తూ.. శుభమస్తూ.. శ్రీకారం చుట్టుకుంది పెళ్లిపుస్తకం.. ఇక ఆకారం దాల్చుతుంది కొత్త జీవితం అని ఓ సినీ కవి అన్నట్లు ..జీవితంలో మర్చిపోలేని ఘట్టం పెళ్లి.. మంచి ముహూర్తాల్లో తమ పిల్లలకు పెళ్లి చేయాలని పెద్దలు భావిస్తారు. మంచి ముహూర్తాలుండే మాసాల్లో వైశాఖమాసం ఒకటి. ఈనెల 7, 8, 9 తేదీల్లో మంచి ముహూర్తాలున్నాయని అలాగే 10, 11, 13, 21, 23 తేదీలు పెళ్లిళ్లకు శుభఘడియలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. దీంతో ఎటు చూసినా పెళ్లిళ్ల హడావిడే కానవస్తోంది. పెళ్లివారి ఇళ్లు జనాలతో కళకళలాడుతున్నాయి. వస్త్రదుకాణాలు, నగల దుకాణాలు, కల్యాణ మండపాలు, కేటరింగ్, డోలు సన్నాయిమేళాలు, ఫొటో గ్రాఫర్‌లు, టిప్‌టాప్ ఇలా ఒకటేమిటి అన్నిటికి డిమాండ్ పెరిగింది.

ముహూర్తాలివీ..



ఈ మాసంలో వివాహ శుభలగ్నాలు గత నెల 30 నుంచి ప్రారంభమైంది. ఈనెల 7నుంచి బలమైన ముహూర్తాలున్నాయని పురోహితుడు గోవిందవఝుల రమణమూర్తి శర్మ చెబుతున్నారు. 8న వివాహాలతో పాటు ఉపనయనాలకు సైతం మంచి ముహూర్తమని వివరించారు. 7న ఉదయం 6.57, రాత్రి 7.17, 10.28, తెల్లవారుజామున 2.18, 8న ఉదయం 6.52, రాత్రి 10.24, తెల్లవారుజాము 2.13లకు, 9న ఉదయం 6.49లకు, రాత్రి 9.43, 10.21, తెల్లవారుజాము 2.11లకు మంచి ముహూర్తాలున్నాయి. అలాగే 10న రాత్రి 7.06, 10.17లకు, 11 ఉదయం 6.40, రాత్రి 7.02, 10.13 తెల్లవారుజాము 2.03లకు మంచి ముహూర్తాలున్నాయి. 13 ఉదయం 6.30, 9.19. తె.1.55, 21న ఉదయం 9.02, తెల్లవారుజాము 1.34, 4.49, 23 రాత్రి 8.46, 9.29, తె.4.28లకు ముహూర్తాలున్నాయి. 15, 16, 17, 18, 22 తేదీల్లో కూడా ఓ మాదిరి ముహూర్తాలున్నట్లు పురోహితులు చెబుతున్నారు.

కలవర పెడుతున్న వాతావరణం

ఇదిలా ఉంటే పెళ్లి ఏర్పాట్లలో ఉన్నవారికి వాతావరణం కలవరపెడుతోంది. ఒక పూట ఎండ, మరో పూట మబ్బులు...వర్షాలు పెళ్లిజనాలను కలవరపరుస్తోంది. ఈనెల 7, 8, 9 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉండటంతో చినవెంకన్న క్షేత్రంలో అన్ని ప్రైవేటు, దేవస్థానం సత్రాలు, కల్యాణ మండపాలు దాదాపు ఫుల్ అయిపోయాయి.ఇదిలా ఉంటే కొందరు ప్రైవేటు గదుల యజమానులు కృత్రిమ కొరత సృష్టించి ఆనకు ఎక్కువ రేట్లు చెప్పి అటు మండపాలకు ఇటు గదులకు అందిన కాడికి దండుకోవడం సర్వసామాన్యమైంది. ముందుగానే మండపాలు, గదులు బుక్ చేసుకున్నవారి పరిస్థితి మెరుగ్గా అనిపించినా లేట్‌గా ముహూర్తాలు పెట్టించుకుని అప్పటికప్పుడు గదులు కావాలనుకునే వారి పరిస్థితి కాస్త కష్టమనే చెప్పాలి.

ఈ మూడు ముహూర్తాల్లోనే..



ఈ నెలలో మంచి ముహూర్తాలే ఉన్నాయి. బలమైన, సాధారణ ముహూర్తాలు దాదాపు 18 ఉన్నాయి. వారి వారి నక్షత్రాలకు అనుగుణంగా ముహూర్త బలం ఉంటుంది. అయితే ఈనెల 7, 8, 9 తేదీలు వివాహాలకు మంచి ముహూర్తాలు. ఈ రోజుల్లో పెళ్లిళ్లతో పాటు ఉపనయనాలు బాగా జరుగుతాయి. 10వ తేదీ కూడా ముహూర్తం మంచిదే.

- గోవిందవఝుల వెంకట రమణమూర్తి శర్మ, పురోహితుడు, ద్వారకాతిరుమల

కార్మిక ఆసుపత్రిలో కష్టాలు

పూర్తిస్థాయిలో లేని వైద్యులు..
అరకొర సిబ్బంది..
తణుకు ఈఎస్ఐలో అందని వైద్యం
కనీస వసతులు లేక అవస్థలు



తణుకు, మే6 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన తణుకు పట్టణంలో ఉన్న ఈఎస్ఐ డిస్పెన్సరీ వైద్య సేవలు అందించేందుకు అవస్థలు పడుతోంది. అరకొర సిబ్బంది, పూర్తి స్థాయిలో లేని వైద్యులు, కనీస సౌకర్యాలు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు.

తణుకు డిస్పెన్సరీ పరిధిలో ఎనిమిది వేల మంది కార్మికులకు ఈ ఆసుపత్రి సేవలందిస్తున్నది. ఆరోగ్య సమస్యలతో వస్తున్న కార్మికులు సాధారణ వైద్య సేవలకు మాత్రమే పరిమితం అవుతున్నారు.కనీసం షుగర్, రక్త పరీక్షలు కూడా చేయని పరిస్థితి. దీనికి సంబందించిన యంత్రం ఎప్పుడో మూలన పడింది. సంవత్సరాలు గడిచినప్పటికి మరమ్మతులు చేయలేదు..కొత్తది కూడా ఏర్పాటు చేయలేదు. ఊపిరి తిత్తులు, గుండె పక్షవాతం వంటి పెద్ద రోగాలతో వస్తే రాజమహేంద్రవరం ఆసుపత్రికి రిఫరల్ చేస్తున్నారు. డిస్పెన్సరీలో 14 మంది సిబ్బంది ఉండాలి. ఏడుగురు మాత్రమే పనిచేస్తున్నారు. ఇద్దరు వైద్యులు ఉండాలి. ఇద్దరిలో ఒకరు మాత్రమే కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. మరో వైద్యుడు రాజమహేంద్రవరం నుంచి వారానికి మూడు పర్యాయాలు వస్తుంటారు. అవుట్ సోర్సింగ్ విధానంలో ఇద్దరు నర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. బీపీ మిషన్ తప్పితే రక్త పరీక్షలతో పాటు ఇతర పరీక్షలు చేసే ఎలాంటి మిషన్‌లు లేవు. రక్త పరీక్షలు చేసే కిట్లు అందుబాటులో లేవు. షుగర్, రక్తపరీక్షలు ఆరు నెలల క్రితం నుంచి ఆగిపోయాయి.

నెలకు యాభై రిఫరల్ కేసులు

ప్రతి నెల కనీసం యాభై రిఫరల్ కేసులు రాజమహేంద్రవరానికి పంపుతుంటారు. జనరల్ వైద్యంకు సంబందించిన మందులు మాత్రమే అందుబాటులో ఉంటాయి. అవి కూడా ఒకసారి వచ్చిన మందులు మరోసారి రావని కార్మికులు చెబుతున్నారు. దీనివల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా గుండె, ఊపిరితిత్తులు, పక్షవాతం వంటి సమస్యలకు సంబందించి మందులు మాత్రం అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ప్రతిరోజు వందమంది వరకు కార్మికులు డిస్పెన్సరీకి వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. కనీస సదుపాయాలు కల్పించడంలో తాత్సారం జరుగుతోంది. మహిళలకు అవసరమైన వైద్యురాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు.



మండుటెండలోనూ కూల్‌గా డ్యూటీ

ఏలూరులో ట్రాఫిక్ పోలీసులకు ఏసీ హెల్మెట్లు

ఏలూరు క్రైం, మే 6 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న ఎండలు... ఒకవైపు వేడి గాలులు... మండుటెండలోనే నిలబడి ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేయాలి. నాలుగు గంటల పాటు ఖచ్చితంగా ఎండలోనే నిలబడి ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. పది నిముషాలు ఎండలో తిరిగి వస్తేనే ఆపసోపాలు పడిపోతుంటాం.. ఎండ, వేడి, దుమ్ము, ధూళి మధ్య ఉంటూ విధులను నిర్వర్తిస్తుంటారు. వీరికి కొంత ఉపశమనం కలిపించాలని పోలీసుశాఖ చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగానే ప్రాథమికంగా ఏలూరు ట్రాఫిక్ పోలీసులకు మూడు ఏసీ (ఎయిర్ కండీషన్డ్) హెల్మెట్లను సమకూర్చింది. ఈ మూడు హెల్మెట్లను ముఖ్యమైన ట్రాఫిక్ పాయింట్లకు ఏర్పాటు చేశారు. ఏలూరు పాతబస్టాండ్, జ్యూట్‌మిల్లు సెంటర్, ఫైర్ స్టేషన్ సెంటర్లలో వీటిని ఎలాట్ చేశారు. ఛార్జింగ్ చేస్తే ఆరు నుంచి 10 గంటల పాటు నిర్విరామంగా పని చేస్తున్నాయి. కూలింగ్ పెంచుకోవడం, తగ్గించుకోవడం చేసుకోవచ్చు. ఈ హెల్మెట్లు సోమవారం రావడంతో ట్రాఫిక్ పోలీస్‌లు వీటిని ధరించి విధులను నిర్వర్తిస్తున్నారు. వీటి ఫలితాలు మెరుగుగా ఉంటే మిగిలిన ట్రాఫిక్ పాయింట్లలో ఉన్న సిబ్బందికి కూడా సరఫరా చేయడానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఏసీ హెల్మెట్లు ధరించి విధులను నిర్వర్తించడంతో చూసినవారంతా ఆ హెల్మెట్ గురించి అడగడంతో వారికి సమాధానం చెప్పడంతోనే సిబ్బంది కొంత అలసిపోతున్నట్లు తెలుస్తోంది.

కూరగాయల బొకేలు !



ప్రముఖులకు స్వాగతం పలకేటప్పుడు, అభినందజాలు తెలిపేసమయంలో సాధారణంగా పూలదండలు, బొకేలు అందిస్తుంటారు. ఇదే ఎప్పటి నుంచో వస్తున్న ఆనవాయితీ.. పాలకొల్లు నియోజకవర్గంలో ఈపద్ధతికి స్వస్తి చెప్పారు. మంత్రి నిమ్మల రామానాయుడు. ఆయనను కలవడానికి వచ్చేవారికి ఒకటే చెబుతున్నారు.."పూలదండలు, బొకేలు తీసుకొని రావడం వల్ల సొమ్ములు వృధా తప్ప ఉపయోగం ఉండదు. వాటిని తర్వాత పక్కన పడేస్తాం.. వాటికి బదులు కూరగాయలు, పండ్లు వంటివి తెస్తే పేద ప్రజలకు ఉపయోగపడతాయి." అని చెప్పడంతో బొకేలు, దండలు మానేసి కూరగాయలు తీసుకొస్తున్నారు. ఇటీవల పోడూరు మండలం కొమ్ముచిక్కాలలో జరిగిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనకు వచ్చిన మంత్రికి స్వాగతం పలికేందుకు పలువురు మహిళలు, నాయకులు, అభిమానులు ఇలా కూరగాయల ప్యాకెట్లు అందజేశారు.

- పోడూరు, (ఆంధ్రజ్యోతి)


తాడేపల్లిగూడెం వాసవీ కళాశాలలో పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

ఈసెట్ ప్రశాంతం

ఏలూరు అర్బన్/భీమవరం రూరల్/తాడేపల్లిగూడెం రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఇంజనీరింగ్ రెండో ఏడాది కోర్సుల్లో ప్రవేశాలకు జరిగిన ఏపీ ఈసెట్ ఆన్‌లైన్ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగింది. ఏలూరు జిల్లాలో ఏలూరు సిద్ధార్థ క్వెస్ట్ స్కూలు పరీక్ష కేంద్రంలో ఉదయం షిఫ్టు పరీక్షకు 180మంది అభ్యర్థులను 175, మధ్యాహ్నం షిఫ్టు పరీక్షకు 142కి 140మంది, సీఆర్ఆర్ కళాశాలకు ఉదయం 148మందికి 145, మధ్యాహ్నం 100మందికి 99, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలకు ఉదయం 100మందికి 98మంది హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో 210 మందికి 205 మంది, డీఎన్నార్ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో 200 మందికి 198 మంది, విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరీక్ష కేంద్రంలో 193 మందికి 191 మంది, విష్ణు మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో వంద మందికి వంద మంది విద్యార్థులు హాజరయ్యారు. తాడేపల్లిగూడెంలోని వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో 230 మందికి గాను, 225 మంది, సాయంత్రం నిర్వహించిన పరీక్షకు 150 మందికి గాను 150 మంది, శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం జరిగిన పరీక్షకు 225 మందికి గాను 219 మంది, సాయంత్రం పరీక్షకు 120 మందికి గాను 119 మంది పరీక్షలు రాశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. ఏ విధమైన ఇబ్బందులు లేకుండా పరీక్ష జరిగినట్టు నిర్వాహకులు తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

» ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్



ఏలూరు క్రైం, మే 6(ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక, సాంకేతిక యుగంలో నేరస్తులు దర్యాప్తును తప్పుదోవ పట్టించడానికి కొత్తకొత్త పద్ధతులను ఉపయోగిస్తున్నారని అటువంటి వారిని సమర్థవంతంగా పట్టుకోవాలంటే పోలీసు అధికారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని దర్యాప్తు పద్ధతులపై అవగాహన కల్గి ఉండాలని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ సూచించారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఫోరెన్సిక్ నిపుణులతో ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోరెన్సిక్ నిపుణుల సహకారంతో హత్యలు, అత్యాచారాలు, అనుమానాస్పద మరణాలు, రోడ్డు ప్రమాదాలు వంటి ముఖ్యమైన కేసుల దర్యాప్తులో భౌతిక ఆధారాల సేకరణ విధానం, దర్యాప్తు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అంశాలపై వర్క్‌షాపులో వివరిస్తారన్నారు. అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఎస్పీ సైంటిఫిక్ అసిస్టెంట్స్ టి.భావ్య, ఎన్.ప్రదీప్‌కుమార్, ఎస్.సుమతి, బి.చిట్టిబాబు, ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఫోరెన్సిక్ మెడిసిన్ కె.భాస్కర్, డీఎస్పీలు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్, సీఐలు, ఎస్ఐలుపాల్గొన్నారు.

వరదలను సమర్థవంతంగా ఎదుర్కొందాం



» ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ గోపీనాథ్

రాజమహేంద్రవరం, మే 6(ఆంధ్రజ్యోతి): రానున్న గోదావరి వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అందరూ సంసిద్ధంగా ఉండాలని ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ కె.గోపీనాథ్ అన్నారు. మంగళవారం ఉదయం రాజమహేంద్రవరం-ధవళేశ్వరం కార్యాలయంలో ఈఈలు, డీఈలు, ఏఈలతో వరద నివారణ సమాయత్త సమావేశం నిర్వహించారు. గతంలో గోదావరి వరదల వల్ల బలహీనపడిన ఏటిగట్లు, వాటి పటిష్టతకు తీసుకున్న చర్యలు, ప్రస్తుతం ముందస్తుగా తీసుకోవాల్సిన పనుల వివరాలను అడిగారు. వరద నివారణ చర్యలు చేపట్టడానికి ఫ్లడ్ స్టోర్స్‌లో ఉన్న ఫ్లడ్ మెటీరియల్ వివరాలతో పాటు కావాల్సిన ఫ్లడ్ మెటీరియల్ వివరాలు అందజేయాలన్నారు. ఫ్లడ్ బ్యాంకులపై కాలువ గట్లపై చెత్తను డంప్ చేస్తున్న గ్రామ పంచాయతీలకు నోటీసులు పంపించాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఫ్లడ్ బ్యాంక్‌లను, ఔట్‌ఫాల్ స్లూయిస్‌ల పరిస్థితిని పరిశీలించాలని ఇసుక ర్యాంపుల కోసం కొన్నిచోట్ల ఫ్లడ్ బ్యాంక్‌లను ఛిద్రం చేస్తున్నారని వాటిని గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించారు. వరదలను ఎదుర్కోవడానికి ఫ్లడ్ డ్యూటీ అధికారులు అందరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. ప్రస్తుతం 20లక్షల క్యూసెక్కులకు పైబడి వరద వచ్చినా తట్టుకునే విధంగా ఫ్లడ్ బ్యాంక్స్ పటిష్టంగా ఉన్నాయన్నారు. కాటన్ బ్యారేజ్ గేట్లకు మరమ్మతులు చేపట్టడానికి రూ.15 లక్షలతో అంచనాలు రూపొందించామని, అనుమతి లభించిన వెంటనే పనులు చేపడతామని తెలిపారు. సమావేశంలో హెడ్ వర్క్స్ ఈఈ ఆర్.కావిశ్వేశ్వరరావు, డిప్యూటీ ఎస్ఈ జి.కనకేశ్, తూర్పుడెల్టా ఈఈ వి.రామకృష్ణ, మధ్యడెల్టా ఈఈ బి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పేదల ఇళ్లు కూల్చడం ఆపాలి

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు హెచ్చరిక

భీమవరంటౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్లను దౌర్జన్యంగా ఎక్స్‌కవేటర్లతో కూల్చడాన్ని విరమించుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. ఉండి నియోజకవర్గంలో పేదలపై జరుగుతున్న దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో భీమవరం పాత బస్టాండ్ ప్రాంగణంలో బహిరంగ సభ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పి.ఫోర్ పేరుతో పేదరిక నిర్మూలన అంటున్నప్పటికీ.. ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు మాత్రం పేదలనే నిర్మూలన చేస్తానని చెబుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక గౌరవమైన డిప్యూటీ స్పీకర్ స్థానంలో ఉంటూ ఇళ్లు కూలుస్తామని బహిరంగంగా ప్రకటిస్తుంటే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా పేదల ఇల్లు కూల్చివేతను ఆపితే ఇది ముగింపు సభ అవుతుందని, లేదంటే ఇదే ప్రారంభ సభగా మారుతుందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రత్నరాజు, దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్. తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర సీనియర్ నాయకులు మంతెన సీతారాం, ఫార్వర్డ్‌బ్లాక్ జిల్లా కార్యదర్శి దండు శ్రీనివాస్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణాను అడ్డుకున్న పోలీసులు

ద్వారకాతిరుమల, మే 6(ఆంధ్రజ్యోతి):పశువుల అక్రమరవాణాను పోలీసులు అడ్డుకున్నారు. ద్వారకాతిరుమల మండలం బుట్టాయగూడెం రహదారిపై అక్రమరవాణా జరుగుతుందన్న సమాచారంతో పోలీసులు నిఘాపెట్టి పట్టుకున్నారు. విజయనగరం జిల్లా పార్వతీపురం నుంచి తమిళనాడు పొల్లాచి మార్కెట్‌కి 48 పశువులను తమిళనాడులోని వట్టం సత్తరం గ్రామస్థుడు దండపాణి వెంకటాచలంకు చెందిన కంటైనర్‌లో డ్రైవర్ పలనిస్వామి తీసుకెళ్తున్నాడు. వీటిని విజయనగరం జిల్లా పెద్దమానాపురానికి చెందిన రాజాన రామారావు, పొల్లాచిలోని కుంకుమరాజు వద్దకు పంపుతున్నాడు. నిఘా ఉంచిన పోలీసులు ఈ కంటైనర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ పలనిస్వామి పోలీసులకు దొరికిపోయాడు, మిగిలిన వారి కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ టి.సుధీర్ తెలిపారు. ఈ కంటైనర్‌లో ఆవులు, ఎద్దులు ఉన్నట్టు సమాచారం.

రైతులు అధైర్యపడొద్దు..

» ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి నాదెండ్ల భరోసా


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల చిత్రంలో ఎమ్మెల్యేలు

భీమవరంటౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): రైతులు అధైర్య పడొద్దని, ప్రభుత్వం ఆదుకుంటుందని, తడిచిన ధాన్యంతోపాటు ధాన్యం సేకరణ లక్ష్యానికి మించి కొనుగోలుకు చర్యలు తీసుకున్నట్టు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. మంగళవారం భీమవరం కలెక్టరేట్‌లో ఉమ్మడి పశ్చిమ జిల్లా ప్రజాప్రతినిధులు, జేసీలు, రైస్‌మిల్లర్లతో సమావేశం నిర్వహించి రైతుల నుంచి రబీ ధాన్యం సేకరణలో ఎదురవుతున్న సమస్యలపై సమీక్షించారు. సమావేశాన్ని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి ప్రారంభించి ఆదివారం కురిసిన వర్షాల వల్ల ధాన్యం తడిచి రైతులు ఆందోళన చెందుతున్న అంశాలను మంత్రికి వివరించారు. అనంతరం జేసీలు ఇప్పటివరకు జిల్లాల్లో రబీ ధాన్యం సేకరణ ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. తొలుత జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం సేకరణ లక్ష్యం ఆరు లక్షల మెట్రిక్ టన్నులు కాగా ఇప్పటివరకు 4,88,225 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని, రైతులకు నగదు గడువులోపుగా 24 గంటల్లోనే జమ చేశామన్నారు. ఏలూరు జిల్లా జేసీ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం సేకరణ లక్ష్యం 3.53 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేసి రూ.487 కోట్లు ప్రభుత్వం రైతుల ఖాతాలలో జమ చేశామని, అధికంగా పండిన పంట దృష్ట్యా మరికొంత అదనపు ధాన్యం సేకరణకు అనుమతులను మంజూరు చేయాలని కోరారు. మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ ఎన్నడూ లేని రీతిలో రబీ, ఖరీఫ్ పంటల్లో రాష్ట్రలో 48.90 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసి 11,400 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో 24 గంటల్లో జమ చేశామన్నారు. గత ప్రభుత్వం 37 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసిందనే విషయాన్ని గుర్తు చేశారు. గత ప్రభుత్వం రూ.1,674 కోట్ల ధాన్యం బకాయిలు చెల్లించకపోవడంతో, ఆ బకాయిలను ప్రస్తుత ప్రభుత్వమే చెల్లించిందన్నారు. ధాన్యం 22 తేమశాతం వరకు ఉన్నా కొనుగోళ్లు జరపాలని అధికారులకు ఆదేశించారు. పశ్చిమ గోదావరి జిల్లాకు ఒక లక్ష టన్నులు, ఏలూరు జిల్లాకు 50 వేలు టన్నులు లక్ష్యం పెంచుతున్నామని తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఎండీ డాక్టర్ మనజీర్ జిలాని సామూల్ మాట్లాడారు. నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, సామంతపూడి శ్రీరామరాజు, మేనేజర్లు, అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

■ తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాకు ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యాన్ని నిర్దేశించారని, దీనిని 7.50 లక్షలకు పెంచి అనుమతులు ఇవ్వాలని కోరారు. తాడేపల్లి నియోజకవర్గానికి ప్రత్యేకంగా 25 వేల మెట్రిక్ టన్నులు అదనపు ధాన్యం సేకరణకు మంజూరు ఇవ్వాలని తెలిపారు. భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ ఊహించని రీతిలో పంట పండిందని, అదనపు ధాన్యం కొనకపోతే రైతులు నష్టపోతారన్నారు. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ గన్ని బ్యాగుల సమస్యను పరిష్కరించాలని, ఖరీఫ్‌లో జూన్ పది నుంచి జూలై పదో తేదీరకు నాట్లు పడేలా షెడ్యూల్ ఉంటే తుపాన్ ఇబ్బందులు ఉండవని సూచించారు.

బకాయిలు జమ చేయండి : నందమూరి

సహకార సంఘాలకు ప్రభుత్వం బకాయి పడ్డ ధాన్యం కొనుగోలు కమీషన్ మొత్తాన్ని వెంటనే సహకార సంఘాల ఖాతాలకు జమ చేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్‌కు సహకార సంఘాల ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నందమూరి సుబ్బారావు కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో మంత్రిని కలిసి వినతి పత్రం అంజేశారు.

వ్యాయామ కాలేజీ అభివృద్ధికి రూ.కోటి 7 లక్షలు

» మంత్రి పార్థసారథి, ఎంపీ పుట్టా


విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి, ఎంపీ పుట్టా

దెందులూరు/ఏలూరు రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వ్యాయామ విద్య కాలేజీ అభివృద్ధికి సహకరిస్తామని, బాలుర, బాలికల వసతి గృహాలు మరమ్మతులకు గురవ్వడంతో రూ.కోటి ఏడు లక్షల నిధులు మంజూరు చేశామని మంత్రి పార్థసారథి, ఎంపీ పుట్టా మహేశ్‌యాదవ్ తెలిపారు. మంగళవారం దెందులూరు మండలం గోపన్నపాలెంలోని శ్రీసీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకార్, అధికారులతో కలిసి వారిద్దరూ వ్యాయామ కాలేజీలో పర్యటించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నతాని యేల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలేజీలో రెండో ఏడాది చదువుతున్న తులసిని అడిగి కాలేజీలో సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలేజీలో శాశ్వత సమస్యల పరిష్కారం కోసం సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గారపాటి రామసీత, తదితరులు ఉన్నారు.

సీహెచ్‌వోల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తాం

కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు సమస్యలను సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్తామని మంత్రి పార్థసారథి హామీ ఇచ్చారు. మంగళవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద 9వ రోజు ధర్నా చేస్తున్న సీహెచ్‌వోలను చూసి, వారి వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పోలవరం పూర్తితోనే నదుల అనుసంధానం

» మంత్రి నిమ్మల రామానాయుడు


ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

పోలవరం, మే 6(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతోనే నదుల అనుసంధాన ప్రక్రియకు శ్రీకారం చుడతామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మంగళవారం ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో కలిసి పోలవరం ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. తొలుత పోలవరం చేరుకున్న మంత్రికి ట్రైకార్ చైర్మన్, ఎమ్మెల్యే, స్థానిక టీడీపీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేయించారు. అనంతరం పోలవరం ప్రాజెక్టులో బట్రస్ డ్యాం, డయాఫ్రంవాల్, గ్యాప్-2 ప్రాంతాల్లో జరుగుతున్న పనుల ప్రగతిని పరిశీలించారు. సంబంధిత వివరాలను సీఈ నరసింహమూర్తి మెగా సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అంగర సతీశ్, బావర్ ఇంజనీర్ హసన్ మంత్రికి వివరించారు. ప్రాజెక్టు కార్యాలయంలో అంతర్జాతీయ విదేశీ నిపుణులు రిచర్డ్ డొనెల్లీ, సీన్ హించ్ బెర్గర్, జియాన్ ఫ్రాన్స్‌కో డి సిక్కో, డేవిడ్ బి.పాల్ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. విదేశీ నిపుణులతో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు పోలవరంపై ప్రత్యేక దృష్టి పెట్టారని, 2027 నాటికి పోలవరం పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని నిపుణులను కోరారు. అనంతరం నిపుణుల బృందానికి శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రతి 15 రోజుల కు ఒకసారి సచివాలయంలో ప్రాజెక్టు పురోగతిపై సీఎం సమీక్షిస్తున్నారని అందుకే పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఇంజనీరింగ్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు, పీపీఏ కార్యదర్శి ఎం.రఘురాం, అధికారులు సరబ్జిత్ సింగ్ బక్షి, రాకేష్‌తోతేజ, అశ్వనీకుమార్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

సెలవుల సమస్యలకు చెక్

» ప్రసూతి సెలవుల గడువు 180 రోజులకు పెంపు

» మహిళా ఉద్యోగినుల హర్షం

ఏలూరు,మే 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వశాఖల్లో ఉద్యోగినులు, సిబ్బంది పిల్లలకు జన్మనివ్వాలంటే సెలవులు పూర్తిస్థాయిలో దొరక్కపోవడంతో తీవ్ర అవస్థలతో సతమతం అయ్యేవారు. అరకొర సెలవులతో చంటిపిల్లల సంరక్షణకు తీవ్ర అగచాట్లు పడేవారు. భార్యాభర్తల మధ్య విభేదాలకు ఇవి దారితీసేవి. మహిళా ఉద్యోగినుల సమస్యలను అర్థం చేసుకున్న తెలుగుదేశం ప్రభుత్వం ప్రసూతి సెలవుల గడువును 120రోజుల నుంచి 180 రోజులకు పెంపు చేస్తూ జీవోను జారీ చేసింది. గతంలో 120 రోజులు కూడా ఇద్దరు బిడ్డలు పుట్టిన వారికే అనుమతి ఇవ్వడంతో మహిళా ఉద్యోగినులు అవస్థలు పడేవారు. ఇద్దరిలో ఒకరు చనిపోతే, మరో బిడ్డకు జన్మనించే అవకాశం లేకుండా పోయేది. దీన్ని కూడా ముగ్గురు బిడ్డల వరకు ప్రసూతి సెలవుల అనుమతికి గ్రీన్ సిగ్నల్‌ను ప్రభుత్వం ఇచ్చింది. విభజిత రాష్ట్రంలో జనాభా పెరుగుదల అవసరాన్ని, యువతరం జనాభా వల్ల భవిష్యత్ ఏపీ అవసరాలకు వినియోగించేందుకు ప్రభుత్వం కీలకమైన నిర్ణయాలను తీసుకోవడంతో ఉద్యోగినులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో ఉన్న మహిళా ఉద్యోగులు ప్రసూతి సెలవులు వినియోగించు కునేందుకు ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై మహిళా లోకం జోష్‌లో ఉంది. ఇద్దరు కన్నా తక్కువ పిల్లలు ఉన్నప్పుడు మాత్రమే ఈ సెలవులు వినియోగిం చుకోవాలనే నిబంధన ఉండేది. తాజా ఉత్తర్వుల ప్రకారం ఈ నిబంధన ఎత్తివేశారు. ఉమ్మడి జిల్లాలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, ప్రభుత్వ టీచర్లు, ఇతర శాఖల్లో ఉద్యోగినులు మొత్తం పది వేలకు మందికి పైగా పనిచేస్తున్నారు. ఇందులో 30శాతం పైబడి సెలవులు వినియోగం ఉపయుక్తం కానున్నట్లు సమాచారం.

పిల్లల సంరక్షణకు ఉపయోగం



ప్రసూతి సెలవులపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడం అభినందనీయం. ఇద్దరు బిడ్డలు కలిగిన ఎవరైనా అనుకోని రీతిలో ఒకరు మరణిస్తే, మూడో బిడ్డకు జన్మనివ్వడం అనేది ఈ ప్రభుత్వంలో మహిళలకు వరం.

- డి. నాగదేవి, ఏపీ ఎన్జీవోస్ మహిళా ఉద్యోగినుల ఉమ్మడి జిల్లా కన్వీనర్

కాబోయే తల్లులకు ఇది వరం



మహిళా ఉద్యోగినుల్లో కాబోయే తల్లులకు ప్రభుత్వం నిర్ణయం వరం వంటింది. ప్రభుత్వం సముచితమైన నిర్ణయమే ఉద్యోగినుల పట్ల తీసుకుంది.

- సత్యభారతి, ఏపీ ఎన్జీవోస్ జాయింట్ సెక్రటరీ

చెల్లని చెక్కు కేసులో ఇరువురికి జైలు

నూజివీడు టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో ఇరువురికి ఆరునెలలు జైలుశిక్ష విధిస్తూ నూజివీడు ప్రత్యేక న్యాయమూర్తి వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పుచెప్పారు. నూజివీడుకు చెందిన కందుల దయాసాగర్, పడిసెల హరీశ్ నుంచి రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నారు. బాకీ తీర్మాన నిమిత్తం చెక్కు ఇవ్వగా, ఆ చెక్కు బ్యాంకులో నగదు లేదని తిరిగివచ్చింది. ఈమేరకు హరీశ్ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, కేసును విచారించి దయాసాగర్‌కు ఆరునెలలు జైలుశిక్ష, రూ.7 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. మరో కేసులో నూజివీడుకు చెందిన బొల్లిగర్ల పుల్లారావుకు ఆరునెలలు జైలు శిక్ష, రూ.4లక్షలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. నూజివీడుకు చెందిన బెజవాడ రామారావు నుంచి బొల్లిగర్ల పుల్లారావు 2016లో రూ.3,60,000 అప్పుగా తీసుకున్నాడు. బాకీ నిమిత్తం చెక్కు ఇవ్వగా ఆ చెక్కు తిరిగి వచ్చింది. ఈ కేసులో నిందితుడు పుల్లారావుకు ఆరునెలలు జైలు శిక్ష, రూ.4లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

క్రైమ్ కార్నర్

మనోవేదనతో మహిళ ఆత్మహత్య


రామతులసి(ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, మే6 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వచ్చిందనే మనోవేదనతో మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు కొత్తకాలనీలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. కొత్తకాలనీకి చెందిన గాలిదేవర రామతులసి(40) ఓ కళాశాలలో పనిచేస్తూ జీవనం సాగిస్తుంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు. వారిద్దరికి వివాహం జరిపించగా ఇటీవల ఆమెకు క్యాన్సర్ అని తేలడంతో కాకినాడలో చికిత్స తీసుకుంటుంది. అక్కడ కీమో థెరపి చేయడం, క్యాన్సర్ అనే విషయం జీర్ణించుకోలేక ఆమె బుధవారం తెల్లవారు జామున పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెను 108 వాహనంలో తాడేపల్లిగూ డెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రసాద్ వివరించారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

ఏలూరు క్రైం, మే 6(ఆంధ్రజ్యోతి): బహిర్భూమికి వెళ్తూ రైలు పట్టాలు దాటుతున్న ఓ వ్యక్తిని ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే పరిధిలోని కృష్ణాజిల్లా బాపులపాడు మండలం కోడూరుపాడు గ్రామానికి చెందిన చిట్టిబొమ్మల ఏడు కొండలు (58)కి చెముడు ఉంది. అతను ఇంటి సమీపంలోని రైలు పట్టాల వద్దకు మంగళవారం బహిర్భూమికి వెళ్తుండగా పట్టాలుదాటే సమయంలో ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు రైల్వే ఎస్ఐ పి.సైమన్‌కు అందడంతో తన సిబ్బందితో సంఘటనా స్థలనికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువు లకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారును క్రాస్ చేసేందుకు ప్రయత్నించి..

» కారు కింద పడి ఇద్దరికి తీవ్ర గాయాలు

నల్లజర్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలివి.. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం కన్నపురానికి చెందిన భాస్కర్‌రెడ్డి, గంగిరెడ్డికి బైక్‌పై బైక్‌పై కన్నాపురం నుంచి తాడేపల్లిగూడెం వెళుతున్నారు. ప్రకాశరావుపాలెం శివారులో కారును అధిగమించే క్రమంలో అదే కారుకింద పడి తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎటువంటి పోలీస్ కేసు నమోదు కాలేదని ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.


సత్యనారాయణపురం వద్ద నుజ్జునుజ్జయిన రెండు కార్లు

డివైడర్‌ను దాటి దూసుకొచ్చిన కారు

» హైవేపై మరోవైపు వస్తున్న కారును ఢీకొట్టిన వైనం

ఏడుగురికి స్వల్ప గాయాలు

ఆసుపత్రికి తరలింపు

దెందులూరు, మే 6(ఆంధ్రజ్యోతి) : ఏలూరు వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను దాటి మరోవైపు హైవేపై వస్తున్న మరో కారును ఢీకొట్టిన ఘటన జరిగింది. ఏలూరు జిల్లా దెందులూరు మండల పరిధిలోని 16వ నంబరు హైవే వద్ద సత్యనారాయణపురం సమీపంలో మంగళవారం జరిగింది. ఈ ప్రమాదంలో రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న కారులో నలుగురు వ్యక్తులకు గాయాలు కాగా హైవేపై రెండో వైపు వస్తున్న కారుపై బొల్తా కొట్టి పడడంతో ఆ కారులో ఉన్న ముగ్గరికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో ఏలూరు ఆసుపత్రికి తరలించారు.

బైక్‌ను తప్పించబోయి చెట్టును ఢీకొట్టిన కారు

» ప్రమాదంలో టీడీపీ నేత ప్రకాశ్‌చౌదరి దంపతులు, మోటారు సైక్లిస్టుకు తీవ్ర గాయాలు


ధ్వంసమైన కారు

ద్వారకాతిరుమల, మే6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సొసైటీ పెట్రోల్ బంక్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తల తోపాటు మరో వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. తిమ్మాపురానికి చెందిన టీడీపీ నేత మొగతడకల ఓం ప్రకాష్‌చౌదరి వైజాగ్ వెళ్లేందుకు గ్రామ శివారులో ఉన్న తమ సొంత పెట్రోల్ బంక్‌కు భార్య శ్రావణితో కలసి కారులో వెళ్లాడు. పెట్రోల్ కొట్టించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా అదే సమయంలో మండలంలోని తిరుమలంపాలెంకు చెందిన కొబ్బరికాయల వ్యాపారి మిడతా సత్యనారాయణ ఘటనా స్థలం వద్ద పెట్రోల్ కోసం వెళుతూ అకస్మాత్తుగా అడ్డువచ్చిన బైక్‌ను తప్పించబోయి కారు వేగంగా పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది. కారులో ఉన్న రెండు బెలూన్లు ఓపెన్ అయ్యాయి. కారు ముందుభాగం, బైక్ పూర్తిగా ధ్వంసమైంది. ఈ క్రమంలోనే దంపతులిద్దరితో పాటు మోటారు సైక్లిస్టుకు తీవ్రగాయల య్యాయి. స్థానికులు సాయంతో వీరిని ఏలూరు ఆయుష్ ఆసుపత్రికి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ఆయుష్‌కు తరలించారు. సమాచారాన్ని అందుకున్న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు విజయవాడ ఆసుపత్రికి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు.


వాహనాన్ని సీజ్ చేసిన విజిలెన్సు అధికారులు

సబ్సిడీ విత్తనాల అక్రమ రవాణా

» ఇద్దరిపై కేసు నమోదు.. వ్యాన్ సీజ్

ఏలూరు క్రైం, మే 6(ఆంధ్రజ్యోతి): ఎటువంటి బిల్లులు లేకుండా 43.60 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలను బాపట్ల నుంచి కిర్లంపూడికి రవాణా చేస్తున్న ఒకమినీ లారీని విజిలెన్సు అధికారులు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విజిలెన్సు జిల్లా ఎస్పీ వి.శ్రీరాంబాబుకు అందిన సమాచారంతో ఏలూరు మెయిన్‌బైపాస్‌పై విజిలెన్సు, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం మధ్యాహ్నం తనిఖీలు చేపట్టారు. ఒక మినీలారీలో 43.60 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలు ఉండడాన్ని గుర్తించారు. వాటికి బిల్లులు లేకుండా ఉండడంతో సీజ్ చేశారు. వాటి విలువ నాలుగు లక్షల 80 వేల 280 రూపాయలు కాగా మినీ వ్యాను విలువ 8 లక్షల 60 వేల రూపాయలు అని మొత్తం 13 లక్షల 40 వేల 280 రూపాయలు విలువగల సొత్తును సీజ్ చేశారు. కల్లపురెడ్డి వీరరాఘవ అలియాస్ నాని, కల్లపురెడ్డి జయేశ్వరరావులపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ శివరామకృష్ణ, విజిలెన్స్ ఏవో జి.మీరయ్య, పెదవేగి ఏవో ప్రియాంక, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మంచిలిలో ఇసుక లారీ బీభత్సం



మంచిలిలో స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

అత్తిలి, మే 6 (ఆంధ్రజ్యోతి) : మంచిలి గ్రామంలో ఇసుక లారీ బీభత్సం సృష్టిం చింది. అతివేగంగా మోటారు సైక్లిస్టును ఢీకొని రోడ్డు మార్జిన్‌లో ఉన్న రెండు విద్యుత్ స్తంభాలపైకి దూసుకెళ్లింది. వివరాలివి.. అత్తిలి మండలం కంచుమర్రు గ్రామానికి చెందిన రేషన్ డీలర్ కోరుకొల్లు కుమార్ జోషిబాబు మంచిలి గ్రామంలో తాగునీటిని తీసుకువచ్చేందుకు మోటారు సైకిల్‌పై వస్తున్నాడు. భీమవరం నుంచి పెండ్యాల వైపు వెళుతున్న ఇసుక లారీ వెనుక నుంచి ఢీకొట్టి, కొద్దిదూరం వెళ్లి విద్యుత్ స్తంభాలను ఢీకొట్టింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ప్రమాద స్థలానికి పోలీసులు చేరుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీని నడపడం వల్లే ఈ ఘటన జరిగిందని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్ అధికారులు వచ్చి విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు.

● ఈ ఘటన జరిగిన సమయంలో కారులో వెళ్తున్న అత్తిలి ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు చూసి ఆగారు. గాయాలైన మోటారు సైక్లిస్టు కుమార్ జోషిబా బును తన కారులో ఎక్కించుకుని తణుకు ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించి మానవత్వం చాటుకున్నారు.

రైతులను ఆదుకోవాలని ఆర్డీవోకి వినతి

ఏలూరు రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి) : రైతుల దగ్గర ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని వైసీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డి.నాగేశ్వరరావు ఏలూరు ఆర్డీవోని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అకాల వర్షానికి నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, అసెంబ్లీ ఇంచార్జీ మామిళ్ళపల్లి జయప్రకాశ్, నూజివీడు నియోజకవర్గ ఇన్‌చార్జీ మేక వెంకట ప్రతాప్ అప్పారావు, పుప్పాల వాసుబాబు,కంభం విజయరాజు ఉన్నారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

జంగారెడ్డిగూడెం, మే 6(ఆంధ్రజ్యోతి): పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు బుధవారం తాడువాయిలో నిర్వహించనున్నట్టు విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు కొక్కొండ బ్రహ్మం, దాగం వేణు గోపాలాచారి, శ్రీపాద నరేశ్, కొక్కొండ శ్రీను మంగళవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు అన్న సమారాధన, సాయంత్రం నాలుగు గంటలకు స్వామి వారి ఊరేగింపును వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

శ్రీవారికి కల్యాణ పట్టువస్త్రాల బహూకరణ

ద్వారకాతిరుమల, మే 6(ఆంధ్రజ్యోతి) : చినవెంకన్న ఆలయంలో జరిగే వైశాఖమాస బ్రహ్మోత్సవాలకు ఓ దాత సుమారు రూ.2 లక్షల విలువైన పట్టు చీరలు, పంచెలు ఇచ్చినట్టు ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. విజయవాడకు చెందిన రావాడ చిరంజీవి ఈ వస్త్రాలను ఆలయ కార్యాలయంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వాటిని ఆలయ ఈవో పరిశీలించారు. దాత కోరిక మేరకు కల్యాణ మహోత్సవాల్లో వీటిని స్వామి, అమ్మవార్ల అలంకరణలో వినియోగించనున్నట్టు ఈవో వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో బాబూరావు, ఏఈవో పి.నటరాజారావు, రొంపిచర్ల హనుమంతచార్యులు, హయగ్రీవ పాల్గొన్నారు.

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలి

ఏలూరు కార్పొరేషన్, మే 6(ఆంధ్రజ్యోతి) : రైతుల నుంచి పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, కార్యదర్శి వర్గ సభ్యులు కె.శ్రీనివాస్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయం వద్ద మంగళవారం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ప్రతీ గింజను గతంలో ఇచ్చిన హామీ ప్రకారం కొనుగోలు చేయాలన్నారు. టార్గెట్‌ల పేరుతో కొనుగోలు సమయానికి రైతులను టార్గెట్ చేసి ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ఏలూరు జిల్లాలో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయితే రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు లక్ష్యం నిర్ణయించడం అన్యాయమన్నారు. రైతుల ఆందోళనలు, ఉద్యమాల నేపథ్యంలో మరో 50 వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినా మిగిలిన ధాన్యాన్ని రైతులు ఏం చేసుకోవాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతాంగ సమస్యల పరిష్కరించడానికి చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు చేస్తామని రవి, శ్రీనివాస్‌లు హెచ్చరించారు.

ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

ఏలూరుటూటౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఎంపీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎంపీ మహేశ్‌కుమార్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతులు స్వీకరించిన మహేశ్ సమస్యల తక్షణ పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిధులతో సంబంధం ఉన్న సమస్యలు పరిష్కారానికి అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదికలు పంపాలన్నారు.

ఘనంగా వైశాఖి బ్రహ్మోత్సవాలు

ఏలూరు కార్పొరేషన్, మే 6(ఆంధ్రజ్యోతి) : రామచంద్రరావుపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 36వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, చతుష్టానార్చన, మూల హవనాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు కిళాంబి మారుతి శ్రీనివాస రామానుజాచార్యులు, వేద పండితులు యనమండ్ర రవి ప్రకాష్ శర్మవధాని, టీటీడీ స్వర్ణపతక గ్రహీత కిళాంబి వేంకట కృష్ణమాచార్యులు భక్తులతో పూజలు చేయించారు.

ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు అవకాశం

చింతలపూడి, మే 6(ఆంధ్రజ్యోతి) : చింతలపూడిలోని ప్రభుత్వ ఐటీఐలో ఈ విద్యా సంవత్సరంలో చేరేందుకు మంచి అవకాశమని ఐటీఐ ప్రిన్సిపల్ ఎ.ఎస్.వి.కృష్ణమోహన్ తెలిపారు. టెన్త్ పాస్ లేదా ఇంటర్ ఫెయిల్ అయిన 40 ఏళ్ళలోపు వయస్సు కలిగిన వారంతా అర్హులేనని చెప్పారు. ఈ కోర్సుల్లో చేరేందుకు అభ్యర్థులు ఒరిజినల్ ధృవపత్రాలు సమర్పించాలని, నేరుగా ప్రభుత్వ ఐటీఐకి వచ్చి చేరగోరే కోర్సులను ఎంపిక చేసుకోవచ్చన్నారు. ఏమైనా సందేహాలుంటే(94408 49599) సంప్రదించాలన్నారు.

విద్యాశాఖ డైరెక్టర్ వద్దకు ఉర్దూ స్కూలు పంచాయితీ

ఏలూరు అర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి) : నగరంలోని తూర్పువీధి ఉర్దూ మీడియం పాఠశాల్లో తెలుగు, ఆంగ్లమాధ్యమ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, టీచర్ల కేటాయింపు పంచాయితీ మంగళవారం రాష్ట్ర ఉన్నతాధికారుల వద్దకు చేరింది. తాజాగా పాఠశాలవిద్య డైరెక్టర్ విజయరామరాజుకు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు ఫిర్యాదును అందజేశారని ఆ సంఘ జిల్లా నాయకుడు ఎన్.రాంబాబు తెలిపారు. ఇక్కడి స్కూలులో మొత్తం 61మంది విద్యార్థులు చదువుతుండగా, వారంతా గతనెలలో నిర్వహించిన వార్షిక పరీక్షలను ఆంగ్లమాధ్యమంలో రాశారని, ఆ మేరకు 2019నుంచి ఇంగ్లీషు మీడియంలోనే బోధన జరుగుతోందన్నారు. దీనికిభిన్నంగా స్కూలుకు ఉర్దూ మీడియం ఉపాధ్యాయ పోస్టులను కేటాయించడంపై ఫిర్యాదులో పేర్కొన్నారు. తెలుగు మీడియంలో బోధించే సర్‌ప్లస్ స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లు చాలామంది ఉన్నందున ఇక్కడి పాఠశాలలో నియమించేందుకు చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. తమ అభ్యర్థనపై స్పందించిన విద్యాశాఖ డైరెక్టర్ ఈ సమస్య పరిష్కార బాధ్యతలను కాకినాడ ఆర్జేడీకి అప్పగించారని వివరించారు.

పవన్ కళ్యాణ్‌పై వైసీపీ దుష్ప్రచారం మానుకోవాలి

ఏలూరు రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై వైసీపీ నాయకులు దుష్ప్రచారం మానుకోవాలని లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆర్టీసీ విజయవాడ జోన్ 2 ఛైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జీ రెడ్డి అప్పలనాయుడు మండిపడ్డారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉగ్ర దాడుల గురించి పవన్ మాట్లాడితే, ముస్లిం సమాజాన్ని కించపర్చారని నీచంగా వైసీపీ ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చేస్తున్న విష ప్రచారాన్ని మానుకోవాలని హెచ్చరించారు.

ఘనంగా భవానీ మాత వార్షికోత్సవాలు

భీమడోలు, మే6(ఆంధ్రజ్యోతి): పూళ్ళలో భవానీ మాత 8వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పుప్పాల హరి, పుప్పాల శ్రీనివాస్, గంధం లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు

ఏలూరుటూటౌన్, మే6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు 8వ రోజుకు చేరుకున్నాయి. డిప్యూటీ లైబ్రేరియన్ నారాయణరావు ఆధ్వర్యంలో గ్రంథాలయ సిబ్బంది విద్యార్థులచేత కథలు చదివించడం, వాటిలోని నీతిని సారాంశం బోధించారు. రిసోర్స్‌పర్సన్ తరుణ్ కుమార్ వేదగణితంపై, ఉపాధ్యాయురాలు డీ.శ్రీవల్లి, బీ.శంకర్ డ్రాయింగ్‌లో శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో వీటీ సందీప్‌కుమార్, ఎండీ అస్లాంపాష పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ప్రమాదాలు ఆపండి

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు.

సమన్వయం అవసరం : ఎంపీ పుట్టా

ప్రమాదాల నివారణకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పలు ప్రతిపాదనలు చేసిందని వీటిని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి కొన్ని పరిష్కరించామన్నారు. సీతంపేట సమీపంలోని కొత్తగూడెం వద్ద గుండుగొలను సమీపంలోను కొమిరేపల్లి పాఠశాల విద్యార్థుల ఉపయోగార్థం ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయించామన్నారు.

సర్వీసు రోడ్లు ఏవీ : ఎమ్మెల్యే చింతమనేని

కలపర్రు నుంచి గుండుగొలను వరకు జాతీయ రహదారిలో సర్వీసు రోడ్లు లేవని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. జాతీయ రహదారి కొన్ని చోట్ల ఎగుడు దిగుడులు ఉండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, జాతీయ రహదారిపై నూజివీడుకు వెళ్లే సర్వీసు రోడ్డు అప్రోచ్‌రోడ్డు నిర్మించాలన్నారు. హైవేపై దగ్గరలో కన్వెన్షన్ సెంటర్ వారు వ్యర్థాలను వేస్తున్నారని వారిపై కేసులు నమోదు చేయాలని, అనుమతులు లేకుండా హోటళ్ల ఏర్పాటు చేయరాదని, జాతీయ రహదారి డివైడర్‌పై గార్డెనింగ్ కాంట్రాక్టర్లు సక్రమంగా నిర్వహించడం లేదని ప్రభాకర్ ఫిర్యాదు చేశారు.

మినీ బైపాస్ అధ్వానం : ఎమ్మెల్యే చంటి

ఏలూరు మినీబైపాస్‌లో కల్యాణమండపాలు, కన్వెన్షన్ సెంటర్ల వ్యర్థాలను రోడ్డుపై వేస్తున్నారని, వారిపై కేసుల నమోదు చేయాలని ఎమ్మెల్యే చంటి డిమాండ్ చేశారు. రహదారి భద్రతా కమిటీ సమావేశాలు నెలనెలా నిర్వహిస్తున్నామని, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తున్నామని సంబంధిత శాఖల అధికారులు ఉమ్మడి తనిఖీలు నిర్వహించేలా జాగ్రత్త పడుతున్నామని కలెక్టర్ వెట్రిసెల్వి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. జిల్లాలో ఎక్కువ ప్రమాదాలు సంభవించే 33 బ్లాక్‌స్పాట్‌లను గుర్తించామని ఎస్పీ వెల్లడించారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పటిష్టం చేస్తాం

చెరువును పరిశీలించి వివరాలు తెలుసుకున్న మంత్రి పార్థసారథి

ఏలూరు టూటౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రజలకు తాగు నీరందించే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు భవిష్యత్తులో ఎటువంటి లీకేజీలు లేకుండా చెరువుగట్లు పటిష్టానికి చర్యలు తీసుకోనున్నట్టు మంత్రి పార్థసారథి తెలిపారు.ఇటీవల సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు గండిపడిన విషయం తెలిసిందే.గండి పూడ్చేందుకు ఎమ్మెల్యే చంటి, మేయర్ నూర్జహాన్ మున్సిపల్ అధికారులు తీవ్రంగా శ్రమించి 48గంటల్లో లీకేజీలను అరికట్టారు. ఈ విషయాన్ని మంత్రికి తెలియజేసిన వెంటనే మంగళవారం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు చెరువును పరిశీలించారు. మున్సిపల్ అధికారులను మంత్రి వివరాలడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును గోదావరి జలాలతో నింపేందుకు తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. అంతే కాకుండా లీకేజీలు, గండ్లు పడకుండా చెరువుగట్ల పటిష్టానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సకాలంలో స్పందించి లీకేజీలను అరికట్టడానికి కృషి చేసిన వారిని అభినందించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్, ఎంఈ సురేంద్రబాబు, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు.



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి



ఆహ్వానం పలుకుతున్న ఆలయ ఈవో

శ్రీవారి కల్యాణోత్సవాలకు ఆహ్వానం

ద్వారకాతిరుమల, మే6(ఆంధ్రజ్యోతి): శ్రీవారి వైశాఖమాస తిరుకల్యాణ మహోత్సవానికి రావాలని కోరుతూ గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి ఆహ్వాన పత్రికను అందజేశారు. నల్లజర్లలోని క్యాంప్ కార్యాలయానికి ఈవో మూర్తి, ఏఈవో నటరాజారావులు వెళ్లి ఈనెల 11న రాత్రి జరుగనున్న స్వామివారి కల్యాణానికి తరలిరావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, దాలయ్య పాల్గొన్నారు.

బాలికలు ఆత్మస్థైర్యాన్ని పెంచుకోవాలి

» కిశోరి బాలికల కార్యక్రమంలో వక్తలు

లింగపాలెం, మే 6(ఆంధ్రజ్యోతి) : బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేసేందుకే కిశోర వికాసం కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్టు ఐసీడీఎస్ సీడీపీవో మాధవి తెలిపారు. మండలంలో వేములపల్లి గ్రామంలో 11 నుంచి 18 ఏళ్లలోపు బాలికలకు కిషోరి వికాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్, సీడీపీవో మాధవి, ఎంపీడీవో కె.వాణి, సర్పంచ్ నత్తా దివ్యదీప్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ బాలికల విద్యాభివృద్ధిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో చదువు మధ్యలో మానివేసిన బాలికలు తిరిగి పాఠశాలలకు వచ్చేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.వాణి, సర్పంచ్ నత్తా దివ్యదీప్తి, రామలక్ష్మి పాల్గొన్నారు.

● పెదపాడు : బాలికలను చదివిస్తే సమాజం అభివృద్ధి చెందుతుందని ఉమ్మడి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. కొత్తూరులో గ్రామంలో అసంఘటిత కార్మికులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

● పెదవేగి : సమాజంలో జరిగే సామాజిక అంశాలపై ప్రతి బాలిక అవగాహన కలిగి ఉండాలని పెదవేగి గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి ఎం.జ్యోతి అన్నారు. కిశోర బాలికలకు అందిస్తున్న కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా పెదవేగి, వేగివాడ, తాళ్లగోకవరం గ్రామాల్లో మంగళవారం కిశోర బాలికలకు అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పెదవేగిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జ్యోతి మాట్లాడుతూ అవగాహనా లేమి బాలికలను ప్రమాదంలో పడేస్తుందన్నారు. వేగివాడ, తాళ్లగోకవరం గ్రామాల్లో ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో పెదవేగి, విజయరాయి, కొప్పాక సెక్టార్ల సూపర్‌వైజర్లు సీహెచ్. పార్వతి, కె.మేరీబాయిమ్మ, కె.శాంతకుమారి పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి : కిశోరి వికాసంలో భాగంగా అంగన్వాడీ ఆరోగ్య శాఖ అధికారుల ఆధ్వర్యంలో జీలుగుమిల్లి ఐసీడీఎస్ కేంద్రం వద్ద బాలికలకు సూపర్‌వైజర్ మహాదేవమ్మ అవగాహన కల్పించారు. బాలికలు కౌమార దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రుతుక్రమ సమస్యలు, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, బాల్య వివాహాల వల్ల భవిష్యత్తులో వచ్చే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. పీహెచ్ఎన్ వెంకటలక్ష్మీ, ఎన్ఎంలు సుబ్బలక్ష్మి, ఐసీడీఎస్ కార్యకర్తలు ఉన్నారు.

● ఏలూరు అర్బన్ : కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం కబడ్డీగూడెం, ఆదివారపు పేటలలో కౌమార బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ ఏలూరు అర్బన్‌ప్రాజెక్టు సీడీపీవో విజయలక్ష్మి మాట్లాడుతూ బాలికల వ్యక్తిగత సమస్యలపై అవగాహన కల్పించారు. పోషక విలువలతో కూడిన ఇంటి తయారీ ఆహార పదార్థాలను మాత్రమే భుజించాలని, జంక్‌ఫుడ్స్ జోలికిపోవద్దని సూచించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ మౌనిక, మహిళా కార్యదర్శులు నాగమణి, సంధ్యారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు హైమావతి, సీయోనుకుమారి, అన్నపూర్ణ, స్వర్ణలత, షమీమాబేగం, వెంకటరమణ, గంగాభవాని, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో మాధవి

ఉపాధి బకాయిలు చెల్లించాలి

టి.నర్సాపురం, మే6 (ఆంధ్రజ్యోతి): మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కూలీల బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు గుడెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. అప్పలరాజు గూడెంలో ఉపాధి హామీ పథకం కూలీలను కలిసి ఈ నెల 20న జరిగే జాతీయ సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి కనీస వేతనం రూ.600 ఇవ్వాలని 200రోజులు పనిదినాలు కల్పించాలని, పేస్లిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రామలక్ష్మి పాల్గొన్నారు.

20న ఉపాధి పనుల బంద్..

పెదపాడు : ఉపాధి వేతన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మికుల ఆధ్వర్యంలో చేపట్టిన ఉపాధి పనుల బంద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి తెలిపారు. నాయుడుగూడెం, ఖాజీగూడెం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం పర్యటించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనా నైపుణ్యాలపై వర్కుషాపు

ఏలూరు అర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి) : పరిశోధనా నైపుణ్యాలపెంపు అనే అంశంపై మంగళవారం స్థానిక సీఆర్ఆర్ కళాశాలలో మూడ్రోజుల జాతీయ స్థాయి వర్కుషాపు ప్రారంభమైంది. రిసోర్స్ పర్సన్లు బ్రహ్మాజీరావు, హరిప్రసాద్ మాట్లాడుతూ రీసెర్చ్ డేటా విశ్లేషణలో వినియోగించే స్టాటిస్టికల్ టూల్స్ గురించి వివరించారు. ప్రిన్సిపాల్ రామరాజు, కరస్పాండెంట్లు కానాల శ్రీనివాసరావు, డాక్టర్ విష్ణు మోహన్, ప్రిన్సిపాల్ రామరాజు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్‌కు మోక్షం

చింతలపూడి, మే 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఎన్నో ఏళ్లుగా సెంట్రల్ లైటింగ్ సమస్య కలగానే మిగిలిపోయింది. కాని ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక దీనికి మోక్షం లభించబోతోంది. నూతన హంగులతో రూపుదిద్దుకోబోతున్న సెంట్రల్ లైటింగ్ పనులకు బుధవారం ఉదయం 11 గంటలకు పనులు చేపట్టే కార్యక్రమానికి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వివాహ వయస్సుపై అవగాహన

పెదవేగి, మే 6(ఆంధ్రజ్యోతి) : కనీస వయస్సు లేకుండా వివాహం చేయడం ఆరోగ్యరీత్యా అనర్థమని, వివాహ వయస్సుపై అవగాహన అవసరమని ఆశా జిల్లా కోఆర్డినేటర్ ఎన్.వెంకట్ అన్నారు. పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో మంగళవారం ఆశాడే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ వివాహ వయస్సుపై అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆశ కార్యకర్తలపై ఉందన్నారు. ఆడవారికి 22, పురుషులకు 25ఏళ్ల వివాహ వయస్సుగా ప్రభుత్వం ప్రకటించిందని, కనీస వయస్సు రాకుండా వివాహం చేస్తే కలిగే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వోలు డి.రోజిమేరీ, అలివేలు మంగ, హెల్త్ విజిటర్లు సుజాత, యామిని, పీహెచ్ఎన్ నాగమణి పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన

ఏలూరు అర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి) : కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, ఫైలేరియా, చికెన్ గున్యా, మెదడువాపు, తదితర వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం పవర్‌పేట అర్బన్ పీహెచ్‌సీలో నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ లార్వాదశలోనే నాశనం చేస్తే దోమలవృద్ధిని సంపూర్ణంగా అరికట్టవచ్చని, తద్వారా వ్యాధులవ్యాప్తికూడా తగ్గించవచ్చన్నారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ గౌతం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



రంజనా నిరులా చిత్రపటం ఎదుట నివాళులర్పిస్తున్న ఆశాలు

కార్మిక చట్టాలను అమలు చేయాలి

టి.నర్సాపురం, మే 6(ఆంధ్రజ్యోతి) : కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఆశ వర్కర్ల జిల్లా కార్యదర్శి పి. పోశమ్మ డిమాండ్ చేశారు. టి.నర్సాపురంలో మంగళవారం ఆశావర్కర్స్ యూనియన్ జాతీయ నాయకురాలు రంజనా నిరులా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోశమ్మ మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ జరుగుతున్న అఖిల భారత కార్మికుల సమ్మెకు ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సభ్యులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి మురళీ, సంఘ కార్యకర్తలు పాల్గొన్నారు.



రాజారావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉద్యోగులు

జిల్లా ల్యాబ్ ఇన్‌చార్జిగా రాజారావు

ఏలూరు, మే 6(ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో ఎంతో ప్రాధాన్యత కలిగిన ఐపీఎం జిల్లా ప్రజారోగ్యశాఖ ప్రయోగశాల ఇన్‌చార్జిగా సీనియర్ ఎనలిస్ట్‌గా వినుకొండ రాజారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జలమే జీవనాధారం అని, స్వచ్ఛమైన నీటి వినియోగం ఉపయోగమని, నీటి వ్యాపారులు తప్పనిసరిగా నీటి నమూనాలు పరీక్షించుకోవాలని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాజారావు సూచించారు. కార్యక్రమంలో ఇటీవల సీనియర్ ఎనలిస్టుగా పదవీ విరమణ చేసిన బి.త్రినాథరావు, ల్యాబ్ టెక్నీషియన్ ఎం.ఆనంద్, శాంపిల్ టేకర్ ఎం.గంగాధర్, శివకుమార్‌లు ఉన్నారు.



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

అభయాంజనేయ స్వామికి పూజలు

పెదపాడు, మే 6(ఆంధ్రజ్యోతి) : అప్పనవీడులోని ప్రసిద్ధి అభయాంజనేయ స్వామిని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌లు దర్శించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద ప్రతి మంగళవారం జరుగుతున్న అన్నదాన కార్యక్రమాన్ని పరిశీలించి, అన్నదాన సత్రం నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి రూ.35 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ దేవస్థానం ప్రాంగణంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అన్నదాన సత్రాన్ని నిర్మించి, నిర్వహిస్తామన్నారు. ఇందులో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సత్రం కృష్ణా, ఏలూరు జిల్లాల ప్రజలకు పూర్తి సౌకర్యవంతంగా ఉండేలా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి ఉచిత కంటి పరీక్షలు

ఏలూరు క్రైం, మే 6 (ఆంధ్రజ్యోతి) : కన్ను అనేది మానవ దేహంలో అత్యంత ముఖ్యమైన అవయవమని దాని సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. ఏలూరులోని అగర్వాల్ కంటి ఆసుపత్రి వైద్య నిపుణుల బృందం ఏలూరు అమీనాపేటలోని పోలీస్ కల్యాణ మండపంలో పోలీస్ సిబ్బందికి కంటి పరీక్షలను ఎస్పీ కిశోర్ ఆదేశాల మేరకు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ సూర్యచంద్రరావు మాట్లాడుతూ కంటి ఆరోగ్యాన్ని కాపాడేందుకు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి ఉచిత కంటి పరీక్షలతో పోలీస్ సిబ్బందికి ఎంతో మేలు జరుగుతుందన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఈ సందర్భంగా డాక్టర్ అగర్వాల్ వైద్య బృందానికి అదనపు ఎస్పీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఏఆర్ఆర్ఐ పవన్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

బుట్టాయగూడెం, మే 6(ఆంధ్రజ్యోతి) : బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, కుక్కునూరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అంగనవాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి మంగళవారం కె.ఆర్.పురం ఐటీడీఏ కార్యాలయంలో అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మెరిట్ లిస్టును జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని కలెక్టర్ ఆదేశాలతో పోస్టుల భర్తీ జరుగుతుందని తెలిపారు. ఇంటర్వ్యూల్లో పీవో కె.రాములు నాయక్, ఆర్డీవో ఎం.వి.రమణ, ఐసీడీఎస్ పీడీ పి.శారద, డిప్యూటీ డీఎంహెచ్‌వో జె.సురేశ్ కుమార్, మౌనిక, సీడీపీవోలు ఇ.తులసీ, ఎన్.లక్ష్మీ కుమారి, యుడిసి కృష్ణవేణి పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

జంగారెడ్డిగూడెం, మే6(ఆంధ్రజ్యోతి) : విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందని పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు ఎల్లా శ్రీను అన్నారు. మంగళవారం పేరంపేట రోడ్డులోని సంఘ భవనంలో ఎల్లా శ్రీను అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టెన్త్, ఇంటర్లలో 90 శాతం మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించిన సంఘ సభ్యుల పిల్లలకు నాయీ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు ఎల్లా శ్రీను తల్లి ఎల్లా సీతా మహాలక్ష్మి జ్ఞాపకార్థం నగదు ప్రోత్సాహకాలు, మెమెంటోలు, పూల మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు కొంతేటి షణ్ముఖరావు, ఎం.తిరుమలరావు, బ్రహ్మాజీ, చిప్పాడ వెంకన్న, కె.సత్యనారాయణ, వి.వెంకట్ పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పథకంపై వైసీపీ ఫైర్

ఏలూరు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : కుట్టు మిషన్లు ఇస్తామని చెప్పి రూ.157 కోట్లను కొట్టేసేందుకు ప్రభుత్వం స్కెచ్ వేసిందని వైసీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ఆరోపించారు. మంగళవారం ఏలూరు జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ మహిళలకు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, కాపు మహిళలకు కుట్టు శిక్షణ పథకంలో మిషన్లు అందించేందుకు తొలుత రూ.100 కోట్లుతో ప్రతిపాదించారన్నారు. ఆ తరువాత ఈ పథకాన్ని రూ.257 కోట్లుకు పెంచి భారీ అవినీతికి పాల్పడుతున్నట్లు ఆయన ఆరోపించారు.

పాకా సత్యనారాయణకు అభినందన

ఏలూరు రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాజ్యసభ అభ్యర్థిగా ఎన్నికైన పాకా సత్యనారాయణను ఏలూరు మాజీ ఎమ్మెల్యే బీజేపీ సీనియర్ నాయకులు అంబిక కృష్ణ కైకలూరులో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఎనిమిది మందిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, మే 6(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నివాసముంటున్న యువతికి ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పి మోసగించిన యువకుడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్.ఐ. ఎస్.కె.జబీర్ తెలిపారు. జంగారెడ్డిగూడెంలో ఉంటున్న యువతికి ప్రేమ పేరుతో కామవరపుకోటకు చెందిన యువకుడు ప్రశాంత్ కుమార్ పసుపుతాడు కట్టాడు.. అలాగే యువతి వద్ద ఉన్న బంగారు వస్తువులు కూడా కాజేశాడు. యువకుడిని నమ్మిన యువతి శారీరకంగా కలవడంతో గర్భవతి అయ్యింది. అప్పటి నుంచి గర్భాన్ని తొలగించుకోవాలని ప్రశాంత్ కుమార్‌తో పాటు మరో ఏడుగురు స్నేహితులు యువతిపై బెదిరింపులకు దిగారు. మోసపోయానని గ్రహించిన యువతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు.

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం

ఏలూరు క్రైం, మే 6(ఆంధ్రజ్యోతి) : ఉన్నత విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ పేర్కొన్నారు. పెదపాడు మండలం కొత్తూరులో అసంఘటిత కార్మికులకు మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో బాలల ఉన్నత విద్య, కార్మిక చట్టాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీవో సూర్యచక్రవేణి, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ కె.శ్రీదేవి, అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి షేక్ బాషా రహతుల్లా, సర్పంచ్ కె పద్మావతి, క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ వినోద్, రాజ్యలక్ష్మి పలువురు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

భీమడోలు, మే 6(ఆంధ్రజ్యోతి) : చెట్టున్నపాడులో ఈ నెల 2న జరిగిన చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు భీమడోలు పోలీసులు తెలిపారు. రామలింగం, కొత్తపల్లి రత్నాకర్ అనే ఇద్దరు వ్యక్తులు కొండపల్లి మధుబాబు అనే వ్యక్తి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు.నిందితులను గుర్తించి సొత్తు రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు. లక్షా 70 వేల విలువైన బంగారపు వస్తువులు, కొంత సొమ్మును స్వాధీన పర్చుకున్నట్టు పోలీసులు తెలిపారు.

కనీస వేతనం చెల్లించండి

కుక్కునూరు, మే 6(ఆంధ్రజ్యోతి): ఆశ వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి వై.సాయికిరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం కుక్కునూరు, అమరవరం ఆసుపత్రిలో వైద్య సిబ్బందికి సమ్మెనోటీసులు అందజేశారు. కార్మికుల హక్కులకు వ్యతిరేకంగా తీసుకొస్తున్న లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా 20న జరిగే సమ్మెలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

నేడు వాసవీ మాత జయంతి

ఏలూరు కార్పొరేషన్, మే 6(ఆంధ్రజ్యోతి) : వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి సత్రం కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వాసవీ జయంత్యుత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు కమిటీ నాయకులు దివ్వెల జయ ప్రకాశ్, పి.రామకృష్ణారావు, డి.నరసింహరావు, ఎం.టి.వి.సత్యకుమార్‌లు తెలిపారు. ఆర్యవైశ్య సత్రం వద్ద మంగళవారం మాట్లాడుతూ బుధవారం సత్రంలో వాసవీ మాత జయంతిని నిర్వహిస్తామన్నారు.. జనార్దన స్వామి ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, ఆర్యవైశ్య సుహాసినీలచే కుంకుమ పూజలు, ఆర్యవైశ్యులందరికీ అన్నదానం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సత్రం కమిటీ ఆధ్వర్యంలో 30 మందికి స్కాలర్‌షిప్‌లు ఇస్తామన్నారు. ఈ మేరకు మంగళవారం నగరంలో అమ్మవారి ఊరేగింపును నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు, కార్యకర్తలు, యువతీ యువకులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

● పోలవరం : పోలవరంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో బుధవారం సామూహిక పూజలు లక్ష కుంకుమార్చనలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు పి.ఫణికుమార్ శర్మ తెలిపారు. అమ్మవారి జయంతి ఆలయ దశమ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం 6 గంటలకు విఘ్నేశ్వర పూజ అమ్మవారికి పంచామృత అభిషేకాలు, ఉదయం 9 గంటలకు సామూహిక పుష్పార్చన నీరాజన మంత్ర పుష్ప కార్యక్రమాలు, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

కోరుకొల్లులో ఉచిత మెగా వైద్య శిబిరం

కలిదిండి, మే6(ఆంధ్రజ్యోతి): కోరుకొల్లు క్రాంతి హైస్కూల్ ఆవరణలో మంగళవారం వర్రే జగన్నాథం ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 600 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. డాక్టర్లు ఎస్.శివశంకర్, నాగ ప్రియ, లక్ష్మీ, బీ.సుజాత, కె.పోతురాజులు వైద్య సేవలందించారు. కోరుకొల్లు వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ చెన్నంశెట్టి కృష్ణ, కార్యదర్శి గొర్తి వెంకటకృష్ణ, ట్రెజరర్ చెన్నంశెట్టి సుబ్బలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ ప్రదేశాల్లో నీటిని నిల్వ ఉంచొద్దు

నూజివీడు టౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): ఖాళీ ప్రదేశాల్లో నీటినిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తద్వారా డెంగీని అరికట్టవచ్చని సబ్ యూనిట్ ఆఫీసర్ యలమంద అన్నారు. నూజివీడు మండలంలోని దిగవల్లి, ముసునూరు మండలం ముసునూరు, రమణక్కపేటలలో ఆశా డే సందర్భంగా డెంగీపై ఆశావర్కర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పీహెచ్‌సీల వైద్య అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ

ముస్లింల సంక్షేమానికే వక్ఫ్ బోర్డు సవరణ

కైకలూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని తీసుకువచ్చింది ముస్లింల సంక్షేమం కోసమేనని రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ అన్నారు. మంగళవారం కైకలూరులో వక్ఫ్ చట్టం 2025పై అవగాహన సదస్సు నిర్వహించారు. కొంతమంది స్వార్థపరులు వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా 39 లక్షల ఎకరాలు భూములు వక్ఫ్‌బోర్డుకు ఉండగా వాటి ద్వారా ఆదాయం 163 కోట్లు మాత్రమే వస్తుందని దీనిలో 3 శాతం మంది ప్రజలకు మాత్రమే లబ్ధి చేకూరుతున్నట్లు తెలిపారు. 40 వేల కోట్లు ఆదాయం వచ్చేలా చేసేందుకే కేంద్రం వక్ఫ్‌బోర్డు చట్టం సవరణ చేసిందన్నారు. ఈ ఆదాయం పెంచితే అట్టడుగున ఉన్న ముస్లింలకు లబ్ధి చేకూరుతుందన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి కిరణ్ మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు సవరణ వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమకిషోర్, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యుడు కె.సుధాకర్‌కృష్ణ, చక్రవర్తి వర్మ, కె.కృష్ణప్రసాద్, జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ భాషా, జిల్లా ప్రధాన కార్యదర్శులు కోటప్రోలు కృష్ణారావు, భాస్కర్, నగరపాటి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఈసెట్ ప్రశాంతం

ఏలూరు అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ రెండో ఏడాది కోర్సుల్లో ప్రవేశాలకు జరిగిన ఏపీ ఈసెట్ ఆన్‌లైన్ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగింది. ఏలూరు జిల్లాలో ఏలూరు సిద్దార్థ క్వెస్ట్ స్కూలు పరీక్ష కేంద్రంలో ఉదయం షిఫ్ట్ పరీక్షకు 180మంది అభ్యర్థులను 175, మధ్యాహ్నం షిఫ్టు పరీక్షకు 142కి 140మంది, సీఆర్‌ఆర్ కళాశాలకు ఉదయం 148మందికి 145, మధ్యాహ్నం 100మందికి 99, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలకు ఉదయం 100మందికి 98మంది హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్



శిక్షణలో మాట్లాడుతున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

ఏలూరు క్రైం, మే 6(ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక, సాంకేతిక యుగంలో నేరస్తులు దర్యాప్తును తప్పుదోవ పట్టించడానికి కొత్తకొత్త పద్ధతులను ఉపయోగిస్తున్నారని అటువంటి వారిని సమర్థవంతంగా పట్టుకోవాలంటే పోలీసు అధికారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని దర్యాప్తు పద్ధతులపై అవగాహన కల్గి ఉండాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ సూచించారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఫోరెన్సిక్ నిపుణులతో ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోరెన్సిక్ నిపుణుల సహకారంతో హత్యలు, అత్యాచారాలు, అనుమానాస్పద మరణాలు, రోడ్డు ప్రమాదాలు వంటి ముఖ్యమైన కేసుల దర్యాప్తులో భౌతిక ఆధారాల సేకరణ విధానం, దర్యాప్తు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అంశాలపై వర్క్‌షాపులో వివరిస్తారన్నారు. ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఎస్‌ఏ సైంటిఫిక్ అసిస్టెంట్స్ టి.భావ్య, ఎన్.ప్రదీప్‌కుమార్, ఎస్.సుమతి, బి.చిట్టిబాబు, ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఫోరెన్సిక్ మెడిసిన్ కె.భాస్కర్, డీఎస్పీలు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్, సీఐలు, ఎస్‌ఐలుపాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి క్షీరబంధు చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న దృశ్యం

ముసునూరు, మే 6(ఆంధ్రజ్యోతి):పాడి రైతులకు కృష్ణామిల్క్ యూనియన్ అన్ని విధాలుగా అండగా ఉంటుందని మేనేజర్ మాగంటి హరిబాబు అన్నారు. గోగులంపాడు పాల సొసైటీలో సభ్యుడిగా ఉన్న రైతు చిమట శివయ్య ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. క్షీరబంధు పథకం ద్వారా రూ.50 వేలు చెక్కును మృతుడి భార్య భవానీకి సంఘ అధ్యక్షుడు తొర్లపాటి రాంబాబు, మేనేజర్, టీడీపీ నాయకులు సంయుక్తంగా మంగళవారం అందజేశారు. సభ్యులు గంధంనేని సుబ్రహ్మణ్యం, పెద్దినేని కృష్ణమోహన్, నాయకులు పాలడుగు నాగేంద్రబాబు, మండవ బ్రహ్మేశ్వరరావు, పాలడుగు రాజాప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం : ఏవో చెన్నారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో

ఆగిరిపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని ఏవో చెన్నారావు సూచించారు. ఆగిరిపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయ గ్రామసభను మంగళవారం డీఎంఎంటీ అల్మాన్నా రాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. చెన్నారావు మాట్లాడుతూ రసాయన రహిత వ్యవసాయంతో ప్రకృతిని కాపాడుకుంటూ భూసారాన్ని పెంచుకుంటూ, భావితరాలకు విషరహిత ప్రకృతిని, పంట భూములను అందిద్దామని తెలిపారు. పీఎండీఎస్ విత్తనాలు 30 రకాలు కలిపి వేసుకుని 45 రోజుల తరువాత భూమిలో కలియదున్నుకుని ప్రధాన పంట వేయడం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గటమే కాకుండా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. అనంతరం ఉత్తమ రైతులను సన్మానించారు. వెలుగు ఏపీఎం డి.రాజశేఖర్, చొటపల్లి విక్టర్‌బాబు, మాదల సత్యకుమార్, పామర్తి నరసయ్య, ఐసీఆర్పీలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

చాట్రాయి, మే 6(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం 2.0లో భాగంగా మండలంలోని టి.గుడిపాడు, చాట్రాయి అంగన్వాడీ కేంద్రాలలో మంగళవారం కిశోర బాలికలకు గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం, బాల్యవివాహాల వల్ల వచ్చే అనర్థాలు, పరిశుభ్రత, రుతుక్రమం, లైంగిక విద్య మొదలైన అంశాలపై బాలికలకు వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాయత్రీదేవి, సీహెచ్‌వో రమణ, హెచ్‌వీ ఝాన్సీ, ఎంఎస్‌కేలు చంద్రకళ, సలోమి, అంగన్వాడీ కార్యకర్తలు తల్లులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ప్రమాదాలు ఆపండి

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు.

సమన్వయం అవసరం : ఎంపీ పుట్టా

ప్రమాదాల నివారణకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పలు ప్రతిపాదనలు చేసిందని వీటిని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకు వచ్చి కొన్ని పరిష్కరించామన్నారు. సీతంపేట సమీపంలోని కొత్తగూడెం వద్ద గుండుగొలను సమీపంలోను కొమిరేపల్లి పాఠశాల విద్యార్థుల ఉపయోగార్థం ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయించామన్నారు.

సర్వీసు రోడ్లు ఏవీ : చింతమనేని

కలపర్రు నుంచి గుండుగొలను వరకు జాతీయ రహదారిలో సర్వీసు రోడ్లు లేవని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. జాతీయ రహదారి కొన్నిచోట్ల ఎగుడు దిగుడులు ఉండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, జాతీయ రహదారిపై నూజివీడుకు వెళ్లే సర్వీసు రోడ్డు అప్రోచ్ రోడ్డు నిర్మించాలన్నారు. హైవేపై దగ్గరలో కన్వెన్షన్ సెంటర్ వారు వ్యర్థాలను వేస్తున్నారని వారిపై కేసులు నమోదు చేయాలని, అనుమతులు లేకుండా హోటళ్లు ఏర్పాటు చేయరాదని, జాతీయ రహదారి డివైడర్‌పై గార్డెనింగ్ కాంట్రాక్టర్లు సక్రమంగా నిర్వహించడం లేదని ప్రభాకర్ ఫిర్యాదు చేశారు.

మినీ బైపాస్ అధ్వానం : చంటి

ఏలూరు మినీబైపాస్‌లో కల్యాణమండపాలు, కన్వెన్షన్ సెంటర్ల వ్యర్థాలను రోడ్డుపై వేస్తున్నారని, వారిపై కేసుల నమోదు చేయాలని ఎమ్మెల్యే చంటి డిమాండ్ చేశారు. రహదారి భద్రతా కమిటీ సమావేశాలు నెలనెలా నిర్వహిస్తున్నామని, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తున్నామని సంబంధిత శాఖల అధికారులు ఉమ్మడి తనిఖీలు నిర్వహించేలా జాగ్రత్త పడుతున్నామని కలెక్టర్ వెట్రిసెల్వి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. జిల్లాలో ఎక్కువ ప్రమాదాలు సంభవించే 33 బ్లాక్‌స్పాట్‌లను గుర్తించామని ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్ వెల్లడించారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా

▸ వైసీపీ నేతలకు మంత్రి పార్థసారథి సవాల్



టీడీపీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

కైకలూరు, మే 6(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు అభివృద్ధిలో వైసీపీ 5 సంవత్సరాల కాలం కంటే ఎక్కువ చేసి చూపామని దీనిపై ఎవరైనా చర్చకు వస్తే వైసీపీ నాయకులు రావచ్చని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి సవాల్ విసిరారు. మంగళవారం కైకలూరు సీతారామ ఫంక్షన్ హాలులో టీడీపీ కుటుంబ సాధికార సారథుల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బటన్ నొక్కి వైసీపీ ప్రభుత్వం పథకాలు అందించినప్పటికీ ప్రజలకు ఉపాధి కల్పించడంలో విఫలమైందన్నారు. ఉపాధి కల్పించేందుకు ఐదు సంవత్సరాల్లో ఒక్క పరిశ్రమకు పునాది వేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరకాలంలో 7 లక్షల కోట్లతో పెట్టుబడి పెట్టిం చేందుకు పునాదులు వేస్తున్నామన్నారు. తెలుగుదేశం పార్టీ ఎంతో క్రమశిక్షణ కలిగిన పార్టీ అని కార్యకర్తలను కాపాడుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న కృషి ఎంతో విలువైనదన్నారు. కుటుంబసాధికార సారథులుగా ఉంటేనే ఉన్నతస్థాయి పదవులు లభిస్తాయన్నారు. సంస్థాగతంగా టీడీపీ ఎంతో బలోపేతమైనదని బూత్, క్లస్టర్, గ్రామ, మండల స్థాయి, జిల్లా, రాష్ట్రస్థాయిలో అనేక అనుబంధ పదవులున్నాయని వీటిన్నింటిని వచ్చే నెల 10వ తేదీలోపు పూర్తిచేస్తుందన్నారు. పార్టీ నిబంధనలను, ఆదేశాలను గ్రామస్థాయిలో కార్యకర్తలు పాటించి అభివృద్ధి, సంక్షేమం వంటి వాటిపై ప్రజలకు వివరించాలని సూచించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ సభ్యత్వాల్లో కైకలూరు నియోజకవర్గ ముందంజలో ఉందని అలాగే కెఎస్ఎస్ కార్యక్రమంలో కూడా నూరుశాతం చేయాలన్నారు. ప్రతీ 60 ఓట్లకు ఇద్దరు సాధికార సభ్యులుంటారని వారిలో ఒకరు మహిళ ఉండేలా చూడాలని సూచించారు. కెఎస్ఎస్‌లో ఉంటేనే పార్టీ పదవులు రావడంతో పాటు ప్రభుత్వ గుర్తింపు లభిస్తుందన్నారు. టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, రాష్ట్రపార్టీ కార్యదర్శి కొత్త నాగేంద్రబాబు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కోకన్వీనర్లు కొడాలి వినోద్, బొమ్మనబోయిన విజయలక్ష్మీ, బలే ఏసురాజు, నియోజకవర్గ పరిశీలకుడు మెంటే పార్థసారధి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు పీజేఎస్ మాల్యాద్రి, అంద్రాజు శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, నారగాని కొండా, టీడీపీ నాయకులు వల్లభనేని శ్రీనివాస చౌదరి, పోలవరపు లక్ష్మీరాణి పాల్గొన్నారు.



వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

లెక్కలపై అవగాహన

ముదినేపల్లి/కలిదిండి, మే 6(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మంగళవారం గణిత శాస్త్రంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక వికాస్ కళాశాల లెక్చరర్ కె.నాగరాజు గణిత శాస్త్రంపై బోధించారు. కలిదిండి మండలంలోని కలిదిండి కోరుకొల్లు గ్రంథాలయాల్లో మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగాయి. కలిదిండి గ్రంథాలయంలో హిందీ వ్యాకరణం నేర్పించారు. కోరుకొల్లు గ్రంథా లయంలో చెస్ పోటీలు నిర్వహిం చారు. అనంతరం పుస్తక పఠనం చేయించా రు. కలిదిండి గ్రంథా లయాధికారి జె.రమేష్ బాబు, కోరుకొల్లు గ్రంథాలయాధికారి రాఘవులు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రసన్న వేంకటేశ్వరస్వామి



సింగరాయపాలెం ఆలయంలో అభిషేకాల్లో పాల్గొన్న భక్తులు

ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ముదినేపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం ఊటుకూరు ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేసి అర్చకుడు ఆసూరి రంగనాథాచార్యులు పూజలు నిర్వహించారు.ఆలయ కమిటీ అధ్యక్షుడు పులిగడ్డ దుర్గా ముక్తేశ్వర వరప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీవారికి పంచామృత అభిషేకం అగ్ని ప్రతిష్ట హోమం, ధ్వజారోహణ కార్యక్రమాలు జరిగాయి. ఈనెల 7న ఉదయం 10 గంటలకు గరుడ వాహనంపై స్వామివార్ల ఊరేగింపు, 8న నిత్య హోమం, శ్రీచక్రస్నానం, ద్వాదశ ప్రదక్షిణలు, ఊంజల్ సేవ కార్యక్రమాలు జరుగుతాయి.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు

ముదినేపల్లి : సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం జరిగిన అభిషేకాలు, ఇతర పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పుట్టలో పాలు పోసిన అనంతరం స్వామివార్లకు అభిషేకాలు జరిపారు. దేవస్థానం ఈవో ఆర్.గంగా శ్రీదేవి ఆధ్వర్యంలో అర్చకులు తోలేటి వీరభద్ర శర్మ, రుద్రపాక బాలగంగాధర తిలక్ అభిషేకాలు జరిపారు.



ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మారిన సప్తగిరి బ్యాంక్

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా సప్తగిరి బ్యాంకు

ముదినేపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ బ్యాంకులన్నీ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా రూపాంతరం చెందాయి. దీంతో ముదినేపల్లి మండలంలోని ముదినేపల్లి, అల్లూరు సప్తగిరి గ్రామీణ బ్యాంక్ శాఖలు కూడా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు శాఖలుగా మారాయి. పేరు మారినా బ్యాంక్ లావాదేవీలు యథావిధిగానే కొనసాగుతాయని ఖాతాదారులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని అల్లూరు ఏపీ గ్రామీణ బ్యాంక్ శాఖ మేనేజర్ ఎన్.రవి తెలిపారు. 1983లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు కృష్ణా జిల్లాల్లో గుడివాడ కేంద్రంగా కనకదుర్గ గ్రామీణ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ముదినేపల్లి మండలం అల్లూరులో తొలి గ్రామీణ బ్యాంక్ బ్రాంచిని ప్రారంభించారు. కొన్నేళ్ల తర్వాత తిరుపతి కేంద్రంగా ఉన్న సప్తగిరి గ్రామీణ బ్యాంకులో కనకదుర్గ గ్రామీణ బ్యాంకును విలీనం చేశారు. ఇప్పుడు గ్రామాల్లో ఉన్న గ్రామీణ బ్యాంకులన్నింటిని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌గా మార్చారు.



విద్యార్థులను తరలిస్తున్న వైద్యాధికారులు

విద్యార్థులకు వైద్య సేవలు

కలిదిండి మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బాలల సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని కలిదిండి పీహెచ్‌సీ వైద్యాధికారి జాహ్నవి అన్నారు.మంగళవారం వినికిడి లోపం, బుద్ధి మాంద్యత, దృష్టి లోపం ఉన్న విద్యార్థులను ప్రభుత్వ వాహనంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యాధికారి హేమంత్, హెల్త్ కమ్యూనిటీ ఆఫీసర్ కిశోర్ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన ఉండాలి : అనూష



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి అనూష

నూజివీడు, మే 6(ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులకు సంబంధించిన చట్టాలపై కార్మికులు పూర్తిఅవగాహనతో ఉండాలని ఒకటో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి అనూష అన్నారు. మంగళవారం నూజివీడు మున్సిపల్ కార్యాలయంలో కార్మిక దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కార్మికులుగా ఎటువంటి సమస్యలు ఉన్నా ఉన్నతాధికారులకు తెలియచేయాలన్నారు. వారు పట్టించుకోకపోతే సంక్షేమచట్టాల ఆధారంగా న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చన్నారు. పేదవారికి మండల న్యాయసేవా అధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తారన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నెం రమేష్, సెక్రటరీ హరిబాబు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నీటి తీరువా వసూలు చేయండి

నూజివీడు టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాల పరిధిలో నీటి తీరువా పన్నులు వసూలు చేసేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సంయుక్తంగా చర్యలు చేపట్టాలని నూజివీడు తహసీల్దార్ సుబ్బారావు సూచించారు. నూజివీడు తహసీల్దార్ కార్యాలయంలో సాగునీటి సంఘాల అధ్యక్షులు, వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్‌లతో నీటితీరువా పన్నుల వసూళ్లపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూళ్లతో వచ్చిన నిధుల ద్వారా సంబంధిత చెరువులను అభివృద్ధి పరుచుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీన్ని గుర్తించి సాగునీటి సంఘాల అధ్యక్షులు, వీఆర్వోలు, రైతులకు అవగాహన కల్పించాలని, డిజిటల్ అసిస్టెంట్‌లు పన్నులు కట్టించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

● కలిదిండి :నీటి తీరువా బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని తహసీల్దార్ రామకృష్ణ అన్నారు. మంగళవారం కలిదిండిలో మండల వీఆర్వోలు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నాలుగేళ్లుగా నీటి తీరువా వసూళ్లు చేయకపోవడంతో రూ.6 కోట్లు బకాయి ఉందన్నారు.డీసీ చైర్మన్లు, నీటి సంఘం అధ్యక్షులు సహకారంతో నీటి తీరువా వసూళ్లు చేయాలన్నారు. కలిదిండి, కోరుకొల్లు డీసీ చైర్మన్లు ముద్దం భోగేశ్వరరావు, పేటేటి సూర్యనారాయణ, ఆర్ఐ శ్యామల పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి

ముసునూరు, మే 6(ఆంధ్రజ్యోతి): కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. మంగళవారం రమణక్కపేట పీహెచ్‌సీ డాక్టర్ కరీముల్లాకు ఆశవర్కర్లు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశాలను కార్మికులుగా గుర్తించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ని ఆశాలు మార్పుచేయాలని, ఒప్పంద జీవోలను విడుదల చేయాలని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్ స్టాండ్ ఏర్పాటు చేస్తున్న అధికారులు

'మనమిత్ర' సేవలు వినియోగించుకోవాలి

చాట్రాయి, మే 6(ఆంధ్రజ్యోతి): మనమిత్ర వాట్సాప్ ఈ-గవర్నెన్స్ సేవలను ప్రజలందరూ ఉపయోగించుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి కోరారు. చాట్రాయి సచివాలయంలో ఏర్పాటు చేసిన మనమిత్ర క్యూఆర్ కోడ్ స్టాండ్‌ను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పౌర సేవలను వాట్సాప్ ద్వారా అందుబాటులోకి తెచ్చిందని, ఎటువంటి శ్రమ, ఖర్చు లేకుండా ప్రభుత్వ సేవలు పొందవచ్చని, అవగాహనతో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి ఎంవీఎస్ నాగరాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, ఎంఎస్‌కే చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లీష్‌పై అవగాహన

చాట్రాయి, మే 6(ఆంధ్రజ్యోతి): వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మండలంలోని చనుబండ శాఖ గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు ఇంగ్లీష్‌పై అవగాహన కల్పించారు. టీచర్ డి.వెంకట్రామయ్య స్పోకెన్ ఇంగ్లీష్ క్లాస్ నిర్వహించి, ఇంగ్లీష్ గ్రామర్‌పై అవగాహన కల్పించారు. అనంతరం కథల పుస్తకాలు చదివించి, క్యారమ్స్ ఆడించారు. లైబ్రేరియన్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

చాట్రాయిలో ఇళ్ల నుంచి చెత్త సేకరణ



చెత్త సేకరిస్తున్న పారిశుధ్య సిబ్బంది

చాట్రాయి, మే 6(ఆంధ్రజ్యోతి): చాట్రాయిలో పంచాయతీ కార్యదర్శి ఎంవీఎస్ నాగరాజు ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది మంగళవారం ఇంటింటికి వెళ్లి తడిచెత్త పొడి చెత్త సేకరించి, సంపద తయారీ కేంద్రానికి తరలించారు. చెత్తను రోడ్ల పక్కన పారబోయవద్దని, దీని వల్ల అపరిశుభ్రత నెలకొని వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని సూచిం చారు. అందరూ పరిశుభ్రత అవసరాన్ని గుర్తించాలని అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఇద్దరికి జైలు

నూజివీడు టౌన్, మే6(ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో ఇరువురికి ఆరు నెలలు జైలుశిక్ష విధిస్తూ నూజివీడు ప్రత్యేక న్యాయ మూర్తి వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పుచెప్పారు. నూజి వీడుకు చెందిన కందుల దయాసాగర్, పడిసెల హరీశ్ నుంచి రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నారు. బాకీ తీర్మాన నిమిత్తం చెక్కు ఇవ్వగా, ఆ చెక్కు బ్యాంకులో నగదు లేదని తిరిగివచ్చింది. ఈమేరకు హరీశ్ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, కేసును విచారించిన అనంతరం దయాసాగర్‌కు ఆరునెలలు జైలు శిక్ష, రూ.7 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. మరో కేసులో నూజివీడుకు చెందిన బొల్లిగర్ల పుల్లారావుకు ఆరునెలలు జైలుశిక్ష, రూ.4లక్షలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. నూజివీడుకు చెందిన బెజవాడ రామారావు నుంచి బొల్లిగర్ల పుల్లారావు 2016లో రూ.3,60,000అప్పుగా తీసుకున్నాడు. బాకీ తీర్మాన నిమిత్తం చెక్కు ఇవ్వగా ఆ చెక్కు తిరిగి వచ్చింది. ఈ నేపథ్యంలో కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుడు పుల్లారావుకు ఆరునెలలు జైలు శిక్ష, రూ.4 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఓ వ్యక్తిపై ముగ్గురి దాడి.. కేసు నమోదు

ముసునూరు, మే 6(ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసిన ఘటనపై ముసునూరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపిన వివరాలివి.. రమణక్కపేటకు చెందిన దిడ్డి ప్రసాద్, దొడ్డి శివ, దిడ్డి రవి సోమవారం రాత్రి సమయంలో బైక్‌పై వస్తున్నారు. అదే రహదారిలో పాలకుర్తి శేఖర్ తన కుమారుడిని వెంట పెట్టుకుని నడుచుకుంటూ వస్తున్నాడు. హారన్ కొట్టినా బైక్‌కు దారి ఇవ్వలేదని, శేఖర్‌పై ఘర్షణకు దిగి, కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో శేఖర్‌కు రక్తపు గయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బాలల కోసం ప్రత్యేక ఆధార్ క్యాంపులు

ఆగిరిపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి):నెక్కలంగొల్లగూడెం సచివాలయం వద్ద ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి.ఆనందబాబు తెలిపారు.బాలల ఆధార్, బయోమెట్రిక్, ఆధార్ అప్‌డేట్ కోసం ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఈనెల 8వ తేదీ వరకు, అనంతరం 12 నుంచి 15తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	150,159,170
చికెన్ విత్ స్కిన్	290
చికెన్ స్కిన్‌లెస్	300
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

